# సహజ సృజన

డా॥ నందిని సిధారెడ్డి

రచన మనిషిలోని సృజనోత్సహానికి వ్యక్తరూపం. లోపల సంచారం చేసే భావాలు, బయటకు రావటానికి అవి జరిపే తీవ్రమైన ఒత్తిడి ఉన్నచోట ఉండనివ్వవు. తెలిసిన భాషలో వచ్చిన తీరులో వెలువడక కుదుటపడవు. ఎవరి భావాలు వారివి. ఎవరి వ్యక్తీకరణ పద్ధతులు వారివి. ఉనికిని సంతరించుకోవడం అనివార్యం. అనివార్యంలోంచే రచన ఆవిర్భవిస్తది. అనివార్యత, తపన మనిషిచేత చాలా సాహసాలు చేయిస్తది. శరీరమెంతో హృదయం అంతకంటే శక్తివంతమైనది. హృదయం పొందే ఒకానొక స్థితి అక్షరంగా అవతరించుటకు రచన.

యరకల యాదయ్యకు అక్షరమంటే ఆరాధన, గానమంటే ఆకర్షణ, కవిత్వమంటే హృదయముడికి ఉడికి, ఉబికి ఉబికి, ఉప్పొంగే మమకారం. మోహం. అంతరంగ కదలికలను "అక్షరమాలలు"గా కూర్చి ప్రకటిస్తున్నడు. యాదయ్య కవిత్వ గ్రంధాల్ని పుక్కిట పట్టినవాడు కాదు. శిల్పనైపుణ్యాల్లో మునకలేసినవాడు కాదు. సహజ కవిత్వ ధోరణి. వచనం రాసిందు, గేయ ధోరణి వస్తే అట్లానే పాడిందు. అదీఇదీ కలిసి ఉప్పొంగితే అదే కురిసిందు. రాస్తూపోతే శతకమైంది. తనది సహజ వచన గేయ కవిత్వమన్నాడు. ఏమైనా యాదయ్య అనుభూతి యాదయ్యదే. యాదయ్య కవనరీతి యాదయ్యది.





# అక్షరమాలలు

## సహజ వచన గేయ కవిత్వ శతకం



## రచన
## యరకల యాదయ్య

కాపీ రైట్ :

అక్షర మాలలు

సహజ, వచన, గేయ, కవితలు

**యరకల యాదయ్య**

మొదటి ముద్రణ : 2016

డి.టి.పి & కవర్ డిజైన్ : **దాచ గ్రాఫిక్స్**

జె.పి. కాలనీ, పటాన్‌చెరు - 502319,

సెల్ : 9948461983

కాపీల కొరకు : **నందిక ఆద్య**

ఇ. నెం. 25-36-4/4జె,

మల్లికార్జున నగర్, భీరంగూడ కమాన్,

రామచంద్రాపురం,

హైదరాబాద్-502032.

సెల్ : 9866468979.

ముద్రణ : **శ్రీ లక్ష్మీ నరసింహా ప్రింటర్స్**

జె.పి. కాలనీ, పటాన్‌చెరు-502319,

సెల్ : 9346664496,

8332924496.



# కృతజ్ఞతలు

పటాన్‌చెరు వాస్తవ్యులు పూజ్యులు శ్రీ వంగరి కిష్టయ్య-కీ॥శే॥ వంగరి అనంతలక్ష్మీ దంపతుల, కుమారులు "అక్షరమాలలు" సహజ వచన గేయ కవిత్వ శతకం ముద్రణకు సహాయ సహకారమందించిన వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు.

అన్ని దానాల్లోకెల్ల అన్నదానం, విద్యాదానం గొప్పదనే మన పూర్వీకులు చెప్పే మాటలను **శ్రీ వంగరి సతీష్-శ్రీమతి హేమలత** దంపతులు విశ్వసిస్తూ ఒక మంచి పనికి వారే స్వయంగా ముందుకు వచ్చి కవితలను, గేయాలను ప్రజలకు తెలియపర్చాలనే సదుద్దేశ్యంతో అక్షర మాలలు పుస్తక ముద్రణ గావించిన శ్రీ వంగరి సతీష్ దంపతులకు వారి కుటుంబ సభ్యులకు.

మరియు నల్లగొండ జిల్లా నోముల గ్రామ వాస్తవ్యులు కీ॥శే॥ గంజి జానయ్య - గ॥బ॥స॥ శ్రీమతి శాంతకుమారి గార్ల ఏకైక పుత్రుడు శ్రీ **గంజి కిశోర్‌కుమార్** గారు వారి ధర్మపత్ని శ్రీలలిత దంపతులు కూడా పుస్తక ముద్రణకు సహాయ సహకారాలు అందించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ వారి కుటుంబ సభ్యులను భగవంతుడు చల్లగా ఆయు రారోగ్యాలతో సుఖ:శాంతులతో చూడాలని కోరుకుంటూ....

కవి

యరకల యాదయ్య

ఎంత వర్ణించినా లోకంలో ఇంకా మిగిలే ఉంటుంది. ఇప్పున్నది మారుతుంది. ఇంకేదో పుడుతుంది. మరేదో రూపు కడుతుంది. జీవితం నూతనం కావడానికి ఇదే. కవిత్వం నిత్యనూతనం కావడానికి ఇదే. యరకల యాదయ్య దాన్ని పసిగట్టిండు. తన ధోరణితో కయిగట్టిండు. యాదయ్య లోకంమీద, జీవితం మీద, కవిత్వంమీద ఎనలేని ప్రేమ పట్టింపు. భవిష్యత్‌లో అవి కొనసాగాలి. అతని అక్షరాలు మరింత మరింత రాణించాలి. గుభాళించాలి.

తారీఖు : **18-03-2016**





డా|| నందిని సిధారెడ్డి



రేగుపండ్ల కోసం ముళ్ళను లెక్కచేయక
చీమచింతకాయల కోసం చివరికొమ్మనెగబాకిన
చిన్ననాటి సంబురం మళ్లీవచ్చునా
ఊరిలోన మందిరములో నందిపైన కూర్చుని
ఓంకార నాదధ్వని ఆలయం నిండిపోయే
నేనే ముందంటే నేనే ముందని
శిఖరంపైకెగ బాకిన చిన్ననాటి సంబురం
మళ్లీవచ్చునా మళ్లీవచ్చునా. (చిన్ననాటి)

బాల్యమెంతో మదురమో ఎవరికీ ఎవరూ చెప్పనక్కరలేదు. ఎవరి బాల్య స్మృతులు వాళ్లకు మరపురావు. మైథిలీ శరన్‌గుప్తా కావచ్చు, గోర్కి కావచ్చు. మనమూ కావచ్చు. యాదయ్య బాల్య సంబురాన్ని, మాధుర్యాన్ని ఎంత మనోహరంగా అరమరికలు లేకుండా ఆవిష్కరించిండు.! శిల్పం వదిలేస్తే ఆ అనుభూతికి ఏది సరితూగుతది? అంతే సహజంగా “శీతాకోకచిలుక” గురించి పలవరించిండు.

నీవేమో గోరంత నీ పయనమేమో ఆకాశమంతా
ముట్టుకుంటే వాడిపోయే మృదువైన రెక్కలు నీవే
ప్రకృతిలో రంగులన్ని పులుముకున్న రెక్కలు నీవే
చిలుకవుగాని చిలుకవు శీతాకోక చిలుకవు (శీతాకోకచిలుక)

ఆకారం గోరంతంట. దాని సంచారం ఆకాశమంతంట
సూటిగా చెప్పినా సుందరంగా చెప్పిండు
'ముట్టుకుంటే వాడిపోడే మృదుత్వం'
ప్రజల పలుకుబడి ఇట్లాంటిదే.
'కోయిల' కవిత. కవి సహజ రమణీయంగా వర్ణించిండు.

*నీ దేహమేమో పిడికడంతా*
*నీ గానమేమో కొండ కోనలంత (కోయిల)*

ప్రకృతి సరే. ఎవరికైనా ఎంతో అందమైంది.
కవులకు మరింత మనోహరం .
మరి – నాగరికత సమాజం. చదువుకున్న సమాజం.
యాదయ్య పరిశీలనలోంచి పలుకుతున్నడు.

*చదువుకుంటేమి సంస్కారం లేనప్పుడు*
*భాష వచ్చిననేమి  మృదువుగా లేనప్పుడు*
*రక్తబంధముంటేమి ఆప్యాయత లేనప్పుడు*
*సిద్ధాంతముంటేనేమి ఆచరణ లేనప్పుడు  (చదువుంటేనేమి)*

సీదాసాదాగా చెబుతున్నట్టే ఉంటుంది.
లోతయిన విషయాలు లోకరీతులు
వ్యాఖ్యానించకుండా కవికి కుదరదు.
ఒకనాటి విద్య "భావితరాలకు భవిష్యత్తుగా నిలిచింది



ఈనాటి విద్య ఉన్నది లేనట్లు లేనిది ఉన్నట్లు
తికమక పెడుతూ కెమెరా ట్రిక్కులతో
ధనార్జనే ధ్యేయంగా నడుస్తుంది" అని
యాదయ్య సరిపోలుస్తూ విమర్శిస్తాడు.  (ఒకనాటి విద్య)
తెలంగాణ సిరి సింగరేణి
బొగ్గంటే నల్లబంగారం. బొగ్గు స్వగతం చిత్రించాడు కవి.

*మెరిసే బంగారానికి మెరుగులెక్కువ*
*నలుగురికి ఉపయోపడే నాకేమి తక్కువ*
*సార్థకం ఎంతో ఉన్నా మెరవలేని నేను*
*ఎందరినో మెరిపించాను.... మురిపించాను. (నల్లబంగారం)*

లోకంలో బంగారానికి విలువ ఎక్కువ. కాని – కనబడని, విలువ కట్టలేని బంగారాలు చాలా ఉన్నాయి.  గుర్తింపుకు నోచని వాటికి గుర్తింపును,  విలువ కొఅగాని వాటికి విలువను, దృష్టి సోకని వాటికి దివ్య దృష్టిని, చేకూర్చటం కవి ప్రత్యేకత.  కవిత్వ సార్థకత పనిగట్టుకొని కాదు. గాని – మనసు కట్టుకుని యాదయ్య ఆ పని చేసిండు.

*సకల జీవుల మనుగడకు సర్వం సూర్యుడే*
*గాలికి ఏ కులం? శ్వాసకు ఏమతం?*
*నీరుకు ఏ కులం? నీతికి ఏ మతం?*
*స్వచ్ఛత జీవితాన్ని మచ్చలేక నిలుపును.*

# కృతజ్ఞతలు

గౌరవనీయులు డాక్టర్ శ్రీ నందిని సిధారెడ్డి గారు తెలంగాణ, కవులకు, మేధావులకు, నాయకులకు అందరికి సుపరిచితులే. తెలంగాణ సాహిత్యాన్ని పెంపొందించడానికి తెలంగాణ కవులందరిని ఒక వేదికపై కలిసి కట్టుగా ఉండాలనే ఉద్దేశ్యంతో తెలంగాణ సాహిత్య సమాఖ్య ఏర్పాటు చేసిన వారిలో ప్రముఖులు. ఈతరం తెలంగాణ కవులకు సాహిత్యపెద్దన్న. నంది అవార్డు గ్రహీత సిధారెడ్డన్న నవ్వుతూ పలకరించే స్వభావం కలిగి నీతికి నిజాయితీ స్వచ్ఛతకు ఆదర్శం సిధారెడ్డి గారు.

నేను పరిచయం అయిన కొన్ని నాళ్లకే అక్షరమాలలు శతకంను డిటిపి కాపీ వారి ముందు పెట్టి ముందు మాటగా అభిప్రాయం రాయాలని కోరిన వెంటనే శతకం మొత్తం చదివి అమూల్యమైన వారి సమయాన్ని వెచ్చించి "సహజ సృజన" పేరుతో పాఠకులకు, ప్రజలకు అక్షర మాలలు కవిత్వం గురించి వారి భావన తెలియపరినందుకు కృతజ్ఞతలు.

సుద్దాల అనగానే ఆనాటి సాయుధ పోరాట పఠిమ కలిగిన ఉద్యమకారుడు, కవి, కీ॥ శే॥ సుద్దాల హనుమంతు గారు ఆనాటి తెలంగాణ ప్రజల నుంచి నేటి పోరాట యోధుల వరకు కవులకు, సుపరిచితులే. వారి కుమారుడే ఈనాటి సినీ, గేయ రచయిత, జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ శ్రీ సుద్దాల అశోక్‌తేజ గారు అందరికి తెలిసినవారే. నాకు తెలిసిన గౌ॥ డాక్టర్ శ్రీ సుద్దాల అశోక్ తేజ గారు ఒక సహనశీలి, సహృదయుడు, మంచి మనస్సున్న అభినందనల వాది. చిరునవ్వుల స్వాగతాభిమాని. వారు అక్షర మాలలు శతకంకు అభినందనలు తెలియజేయుట నాకు, వారికి పాఠకులకు మధ్య బంధం ఏర్పడినందుకు నాకు చాలా సంతోషము. వారికి సదా కృతజ్ఞతలు తెలుపుతున్నాను.





# అభినందన

డా॥ **సుద్దాల అశోక్ తేజ** తారీఖు : 09-04-2016

సిని గేయ, జాతీయ అవార్డు గ్రహిత

**పాటకులకు, అక్షరమాలలు వేస్తున్న యాదయ్యకు అభినందన.**

తల్లినీకు వందనమంటూ
భరతమాతతో సమానంగా సమరయోధులకు వందనమన్నాడు
గంటకో మాటమార్చి పూటకో వేషం (కండువా)
మార్చే నాయకుల, కాంట్రాక్టుల భాగోతం బయట పెట్టాడు.
కనిపెంచిన భగవంతుడైన నాన్న
తనలో సగభాగమన్నాడు.
భూమాత - గోమాత - జగన్మాతలతో
సమ ఉజ్జీగా మాతను నిలిపాడు.
తల్లి తెలంగాణంటే మన తనువే నన్నాడు.
హంస తూలికా తల్పాలపై నిదురించే
చక్రవర్తులను నేలపై పడుకొమ్మని ఆహ్వానిస్తున్నాడు.
పళ్లు - కూరగాయలకు విషం ఎక్కించడం చూడలేక
ఆనాటి ఫలముల రుచులేవి అంటూ
హైబ్రీడు, మాయ తెరలను చూపించే కవి
శ్రీ యరకల యాదయ్య లోని కవి విశాలమైన - లోతైన
దృష్టిని సమర్థిస్తూ అభినందిస్తున్నాను.



డా॥ సుద్దాల అశోక్ తేజ

# పరిచయం

తారీఖు : 12-04-2016

నా చిన్ననాటి మిత్రుడు శ్రీయరకల యాదయ్య మధ్య తరగతి కుటుంబంలో నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం నోముల గ్రామంలో శ్రీ **యరకల వీరయ్య**-కీ॥శే॥ **యరకల రాములమ్మ** గార్ల పుణ్య దంపతులకు 1965లో జన్మించినారు. యాదయ్యకు ఇద్దరు అక్కలు, ఒక అన్నయ్య, ఒక చెల్లెలు, (దివంగతుడైన ఒక తమ్ముడు) ఉన్నారు. వీరిలో యాదయ్య ద్వితీయ పుత్రుడు.

చిన్ననాటి నుండి యాదయ్య ఎంతో కష్టపడినాడు. నా స్నేహితుడు 1984లో పటాన్‌చెరు ఎస్.ఓ.ఎల్. అనే కెమికల్ పరిశ్రమలో షిఫ్టుల వారీగా పనిచేస్తూ, హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాగ్‌లింగంపల్లి (ఉస్మానియా యూనివర్సిటీ)లో 1987లో బి.ఎ. చదివినాడు. ఇబ్బందుల్లో ఉన్న తండ్రికి సహాయ సహకారాలు అందిస్తు అంచెలంచెలుగా ఎదుగుతూ ఒక కార్మికుడిగా కొనసాగుతూ గృహాన్ని ఏర్పరుచుకుని పిల్లలను చదివించుకుంటున్న తరుణంలో ఎస్ఓఎల్ కంపెనీ 2000 సంవత్సరంలో లాకప్ చేసినారు. జీతాలు లేక భయంకర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ అధైర్యపడక భార్య పద్మ ఓర్పుతో లేమిడి సంస్కారాన్ని ఎదర్కొంటూ జీవనాన్ని నడిపినాడు. **నంద్యాల ప్రసాద్‌రెడ్డి** స్నేహితుడి సహకారంతో ప్రగతి ఆర్గానిక్స్ తరువాత శ్రీ వినాయక లైఫ్‌సైన్స్ కెమికల్ కంపెనీలలో జాబ్‌చేస్తూ కూతురు సమత, కొడుకు సందీప్‌లను ఉన్నతమైన చదువులను చదివించుకుంటు కూతురి వివాహం చేసినారు. యాదయ్య తన మనులోని భావాలను, కవితల రూపంలో తన కలంతో కనుల ముందుంచి నందుకు చాలా అభినందిస్తున్నాను. తాను రాసిన కవితలు చదువుతున్నప్పుడు నా చిన్ననాటి గుర్తులు కనుల ముందు కనిపిస్తున్నాయి.

1. తన జీవన బృతికి సహకరించిన మిత్రులను నుద్దేశించి రాసిన వెలిగిపో వెలిగిపో అని పొగిడి పొగిడి చిట్టచివరకు కుచేలుడి అటుకులకు సమానంగా భావింపు అన్న మాట తీరు ఎంతో అద్భుతం.
2. బాలల బతుకులు మారడం లేదు అని చెత్తకుండీలపై శునకములతో సమానంగా భుక్తికోసం వెతుకులాడే నేటి బాలల పరిస్థితి పేద బాలల దుస్థితి నా మనస్సుకు తట్టింది.
3. “అమ్మకడుపు చల్లన” చక్కని చదువు చదివి సర్కారునౌకరని కాలుమీద కాలేసుకుని దొరలాగ బతుకుతాడని ఆశలెన్నో పెట్టుకొని ఆశీర్వదించే మాఅమ్మ హృదయాన్ని హత్తుకునేలా ఉంది.



4. ఎలా మరువను నాలో ఉన్న ప్రేమను ఎలా పంచను నాలో ఉన్న భావం ఎలా తెలపను యాదయ్య మనస్సులోని ఆవేదన అమోఘం.
5. వృద్ధ వయస్సులో జీవనం దుర్భలమైన పయనం ఆదరించే నాధుడు లేక ఎంతో కుమిలిన భాద వృద్దులకే ఎరుక, ఇది నిజం.
6. అమ్మను మరువకు రా! బతికున్నన్ని నాళ్లు చూపని ప్రేమ – పోయినాక రోధిస్తే తిరిగి వచ్చునా అమ్మ, ఇది ప్రతివారు మరువకూడదు.

చిన్ననాటి స్నేహితులం మరువలేని ప్రేమికులం,
మన జాతులు వేరైనా మన మనస్సులు ఒక్కటైనాయి.
అధికారానికి అందానికి అందనిది కావాలి మన (ప్రేమ) స్నేహం.
ఆస్తులకు అంతస్తులకు అడ్డురాకూడదు మన ఆప్యాయత
పరిపూర్ణమైనది స్నేహం. స్నేహంలోనే ఉంది బందం
ఆ బంధమే విడదీయరాని స్నేహం.
యాదయ్య తన మనస్సులోని భావాలను
“అక్షర మాలలు” సహజ, గేయ, వచన కవిత్వం దారా
చక్కగా వివరించినందుకు నేను అభినందిస్తున్నాను.
యాదయ్య ఇంకా ఎన్నో రచనలు రాయాలని ఎంతో ఎత్తుకు ఎదగాలని
మనస్పూర్తిగా కోరుచున్నాను.
యాదయ్య కుటుంబం ఆయురారోగ్యాలతో
సుఖ:శాంతులతో ఉండాలని ఆ భగవంతున్ని ప్రారిస్తున్నాను.
చేమంతి పూబంతి చెలిమితో
మందారం, పూవ్వంత మందహాసంతో
బంతి పువ్వంత భవిష్యత్‌తో
గులాబి పువ్వంత గుండె ధైర్యంతో
మల్లెపువ్వంత మంచి మనస్సుతో నీ
క్షేమాన్ని కోరుకుంటూ
స్నేహమనే ఈ జీవన జ్యోతిని ఎన్నటికి
మరిచిపోలేమని తెలియజేస్తూ...

మీ
స్నేహితుడు
**శ్రీ పొట్టబత్తుల యాదగిరి.**
నోముల.

# అక్షరాలు

ఇసుక నేలపై అక్షరాలే దిద్ది
తాటాకు పత్రాలపై గ్రంధాలే వ్రాసి
యుగయుగాల చరిత్ర తెలిపే ఆ నాటి విద్య
సమాచారం తెలిపి రాజ్యాలను కలుపుతూ
సంస్కారం నేర్పి సాంప్రదాయాలను అలవర్చి
అభ్యున్నతి భావాల నిలయం ఆ నాటి విద్య
పరుల మేలు కోరి కర్తవ్యము తెలిపి
భావి తరాలకు భవిష్యత్‌గా నిలిచింది ఆ నాటి విద్య
కంప్యూటర్ మానిటర్‌పై కళ్లుసారించి
కీబోర్డును నొక్కుతూ మౌస్‌ను వత్తుతూ
ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు తికమక పెట్టే ఈ నాటి విద్య
ఖండఖండాలు దాటి విశ్వమంతా చుట్టివచ్చి
ఖగోళాన్ని భూగోళంగా చుట్టివచ్చి
భూమిలోన ఏముందో..భూమి పైన ఏముందో
ఇంటిలోన కూర్చుని... విశ్వమంతా దర్శించి
పరిశోధనలు చేసి.. పర్సెంటేజీలకు అమ్ముకుని
కెమెరా ట్రిక్కులతోనూ క్లిప్‌లెన్నో చూపించి
ధనార్జనే ధ్యేయంగ నడుస్తుంది ఈ నాటి విద్య



చిన్ననాటి నుంచి నా నుండి పరోపకరాం ఏమి కోరకుండా నేను ప్రయోజకుడిని కావడానికి అడుగడుగునా ఆదరించి అభిమానించి ఆపదలో బందువుగా కష్టాల్లో తోడుగా నిలచి అక్షర మాలల్లో నాగురించి పరిచయం చేసిన శ్రీ పొట్టబొత్తుల యాదగిరి గారికి ఎన్నిసార్లు కృతజ్ఞతలు తెలుపుకున్నా కుచేలుడి అటుకులతో సమానమే. వారికి మరో మారు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

మరో స్నేహితుడు ఆపద్బాంధవుడు కోరాడ వెంకట ప్రసాద్ గారికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

అక్షర మాలలు కవితలు రాసి అవి వినిపిస్తున్నప్పుడు ఓపికతో సహనంతో శ్రద్ధగా విని బాగానే ఉన్నవని ఇంకా మంచిగా రాయాలని నన్ను ప్రోత్సహించిన నా అర్ధాంగి పద్మకు నా కృతజ్ఞతలు.

అదే విధంగా ఈ అక్షర మాలల పుస్తకాన్ని ఓపికతో సహనంతో సమయ స్ఫూర్తితో అవగాహనతో శ్రద్ధగా చూడడానికి ముద్దుగా డిటిపి చేసిన దాస వెంకట ప్రసాద్ గారికి మరియు అందంగా అచ్చు వేసిన అందోల్ భాస్కర్ గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు.

# యాదిలో

ముఖ్యంగా అక్షరమాలలు చదివే పాఠకులకు, వినే శ్రోతలకు నాదో మాట. నేనో కార్మికుడిగా పరిశ్రమలో పనిచేసుకుంటూ జీవితం గడుపుతున్న సందర్భంలో అనుకోకుండా కవితలు గేయాలు రాసినవే. గంటలు గంటలు కలం పట్టి ఆలోచించి రాసిన కవితలు, గేయాలు కావు. ఈ సందర్భంగా నా మిత్రులకు, శ్రేయోభిలాషులకు, నా సహ ఉద్యోగస్తులకు మల్లికార్జున నగర్ కాలనీ వాసులకు, పూజారి వెంకటేశ్వర్లు (అమంగి వేణుగోపాల్ అల్లుడు) దాసరాజు రామారావు, చందన్‌రావు, నాళేశ్వరం శంకర్, డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, ఒద్దిరాజు, కాంచనపల్లి, పగడాల నాగేందర్, జూలూరి గౌరిశంకర్, ఆచార్య రావికంటి వసునందన్, వేముగంటి మురళీకృష్ణ, తెలంగాణ సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, ఇంకా ఎందరో కవులను సాహితీవేత్తలను యాదిచేసుకుంటూ.

ప్రజా కవులు వట్టికోట, సురవరం ప్రతాప్‌రెడ్డి, దాశరథి, డాక్టర్ సి.నా.రే., కాళోజి, పి.వి. నర్సింహారావు, దేశపతి శ్రీనివాస్, వఝుల, ఆప్కారి సూర్యప్రకాశ్, శ్రీమతి స్వాతి శ్రీపాద, అమ్మంగి, గోరేటి వెంకన్న, అందెశ్రీ, గద్దర్, సుదామ, వందేమాతరం శ్రీనివాస్, తైదల అంజయ్య ఇట్లాబోతె మన ముఖ్యమంత్రి కెసిఆర్ గారు కూడా ఒక సాహితీ వేత్తే. ఇంకా ఎందరో మహా కవులు, ప్రజా కవులు అందరు నాకు ఇష్టమే.

ఇందూరి భారతి, మరసం, జయమిత్ర, సాహితి వేదికలు, తెలంగాణ ప్రజల పోరాట పటిమ యాస, భాష, పనిపాట తెలంగాణ చరిత్ర ప్రచురణను జీవన శైలిని అన్ని కోణాల్లో రాసి ప్రజల మనస్సుల్లో ఉన్న ప్రతి కవి, కళాకారులందరికి ఈ అక్షర మాలలు శతకం ద్వారా నమస్కారములు.

మళ్లీ కలుస్తాను వచ్చే ప్రచురణలో...

ఇట్లు

**యరకల యాదయ్య**





# అమ్మకడుపు చల్లన

అమ్మకడుపు చల్లన.. మా అమ్మకడుపు చల్లన
కడుపులో పెట్టుకుని కని పెంచింది.
ఆకలితో కేకలేస్తే తల్లడిల్లే నా తల్లి
తన ఒడిలో చేర్చుకుని చనుపాలతో కడుపునింపి
ఊయలలో వేసి జోలపాటలే పాడి
కన్నబిడ్డ కంటి నిండా నిద్రించాలని
కునుకు పాట్ల మెలకువతో
ఎన్నో రాత్రులు గడిపిన ॥అమ్మ॥
తడబడిన అడుగులతో బుడిబుడి నడకను జూసి
సంబరపడి చాటుకునే మా అమ్మ
అంగిలాగూ వేసుకుని బడికి పోతుంటే
సరస్వతీ పుత్రుడని సంతోషించే మా అమ్మ ॥అమ్మ॥
చక్కని చదువు చదివి సర్కారు నౌకరని
కాలుమీద కాలేసుకుని దొరలాగ బతుకుతాడని
ఆశలెన్నో పెట్టుకుని ఆశీర్వదించే మా అమ్మ ॥అమ్మ॥

# అణ్వాస్త్రాలు

అణ్వా[స్త్రాలతో అనర్థాలే సృష్టించి
మానవ [ప్రగతినే మట్టిపాలు చేసి
అహంకార పెత్తనముతో
అమాయకులను బలిగొని
యురేనియం కుంపటితో
భూ మండలాన్ని బద్దలు చేసి
ఫ్లూటోనియంతో అణుబాంబుల పుట్టుక
ఆరంభమయ్యేను మానవాళి వినాశనం
ఉవ్వెత్తున ఎగసిన స్వదేశీ విధానం
పంచశీల [ప్రాధాన్యమేమాయే
స్వామ్యవాద సిద్ధాంతం మాయమాయే
అలీనోద్యమం ఏమాయే
అమెరికా చేతిలో ఆట బొమ్మాయే
నీతిని జాతిని పక్కన బెట్టి
స్వలాభం కోసం తపన చెందేనా.





# మన పల్లెలు

చక్కనైన మన పల్లెలు
చల్లనైన మన పల్లెలు
కోడికూతలతో తెల్లవారంగా
పసిడి కాంతులతో [ప్రకృతి అందాలు
చక్కని సెలయేర్ల చల్లని గాలిలో
పాడిపంటలతోనూ పచ్చని పైరుతో
పొద్దునే లేచి పొలము గట్లమీద
కూలీనాలి గుంపు వడివడిగా పరిగెడుతూ
లేగదూడల గుంపు గొర్ల మందను చూడ
హలం బట్టి రైతన్న పొలమునే దున్నంగ
కుమ్మరి సారెతో కమ్మరి కొలిమితో
వడ్రంగి ఉలితో నేత మగ్గాలతో
చాకలి రేవుతో గౌడ ముస్తాదుతో
గంగిరెద్దుల వారి ఆట పాటలతోనూ
రచ్చబండల మీద పంచాయతీ జరిపి
అలసి సొలసిన జనం ఆగినా పనులెన్నో
సంధ్యా సమయమున డప్పు చాటించి
మంచి చెడులను పుర జనులకు వినిపించి
బంట్రోతులు గస్తీలే తిరగంగ
ఆదబాదలు మరిచి ఊరంత నిదురించె మన పల్లెల్లోన.

# చదువుంటేనేమి

చదువుంటేనేమి సంస్కారం లేనప్పుడు

ధనముంటేనేమి విద్య లేనప్పుడు

తెలివుంటేనేమి లౌక్యం లేనప్పుడు

భాష వచ్చిన నేమి మృదువుగా లేనప్పుడు

రక్తబంధముంటేనేమి ఆప్యాయత లేనప్పుడు

గౌరవమున్ననేమి ఆధరింపు లేనప్పుడు

పలకరించిననేమి అభిమానం లేనప్పుడు

సంపాదించిననేమి సంతోషము లేనప్పుడు

సిద్ధాంతముంటేనేమి ఆచరణ లేనప్పుడు



# రాజనీతి

రాజనీతి పరుడవై రాజ్యమేలాలి

సకల జనులను సల్లంగ జూడాలి

జనదీన బతుకును దరి చేరనీయకు

కడుపేద జీవుల కష్టాలు తీర్చు

మనుస్సు జేసుకుని మార్గము చూపయ్య

ఆస్తిపాస్తులే నీ అంతస్తులు అని

ఆత్మగౌరవాన్ని చంపుకోకయ్య

ఆదరించిన వారిని మరువబోకయ్య

రాబోయే తరంకు కావాలి స్ఫూర్తిగా

నీపేరు ఘనంగా చెప్పాలి జనం రా

వెలిగే సూర్యునిలా కాసే వెన్నెలలా

గాలి వీచే వరుకు భూమి తిరిగే వరుకు

జనుల నోటిలోన ఆడే నాల్కవై

సాహిత్య శీలుడై ఆదర్శప్రాయుడై

ఇలలోన నీవు గొప్పగా ఎదగాలి

# కోట్లకొద్ది

కోట్లకొద్ది జనములో మనమెంత అనుకుంటే

అనుకుంటే పొరపాటే, గ్రహపాటనుకుంటే పొరపాటే

ధైర్యంతో అడుగేస్తే అదేలే స్థైర్యం

అనునిత్యం భయంతో బతుకే ఓ బతుకు కాదు

ఓర్పుతో నేర్పుతో యుక్తితో శక్తితో శిఖరాన్ని చేరుకో

దివిటిలాగ వెలిగిపో దేదీప్యంగా మెరిసిపో

సామాన్యుడవని చిన్నచూపు చూడకు

కొండంత బలముతో అండగా నీవుండరా

జన్మమున్నంత వరకు ఆప్తులను విడవకు

మాయమాటలు విని మంచిని మరువకు

అందరికోసం ఒక్కడిగా నిలబడు.



# నల్లబంగారం

మట్టిలోన ముద్దను మాయలేమో తెలవవు

సింగరేణి బంగారం సిరిసంపదను

మెరిసే బంగారానికి మెరుగులెక్కువ

నలుగురికి ఉపయోగపడే నాకేమి తక్కువ

సార్థకం ఎంతో ఉన్నా మెరవలేని నేను

ఎందరినో మెరిపించాను.... మురిపించాను.

పనికి రానిదని పక్కకు పడవేసినా

తక్కువదని చిన్నచూపు చూసినా

కాలిపోతు కరిగిపోతూ ప్రగతికి సోపానమేస్తూ

మానవాళి మనుగడకు అహర్నిశలు వెలుగునిస్తూ

అభివృద్ధి బాటలో నేనే ముందంటూ

నల్లబంగారంగా నేల తల్లిలో భాగాన్నే.

# పొద్దు

పొద్దు ముద్దుగా పొడవంగ
భానుడి ఉషస్సు ధరణికి తగలంగ
జనజీవం అలలై కదిలే ఇలపైన
పొద్దు పొడుపునే ఆరంభంగా
దినధన చర్యల్లో ఆచరణ
స్థితి గతుల్లో మార్పు చేర్పులు
నిత్య ఆలోచనలో ధృడసంకల్పం
తీరికలేని పని పయనంబున
ఆకలిని గుర్తుచేసే ఆ సూర్యుడే
నెత్తిమీదకు పొద్దు ఎక్కి లోకానికి సమయం జూపే
ఆగిపోని ఆ“గడియా”రం
పొద్దుబంగిన సమయమున
మానవుని ఆదుర్త ఎంతనో
సూర్యాస్తమయమున పని సమాప్తమని తలచి
జీవజాతులన్ని తమ గూటికి చేరువాయే
సంధ్యవేళ సమీపించెనని భూ భ్రమణం ఆగిందని
నిదురోయే జనజీవం
గుడ్లగూబలు గబ్బిలాలు కౄరమృగజాతులు
చీకటిలో సంచరించెను రాక్షస జాతులెన్నో.



# కురవక

చినుకు కురవక నేల తడవక విత్తనమే మొలకెత్తదాయె
నేలతల్లి బోసిపోయి నిండుతనమే కనబడదాయే
సజ్జ, జొన్న, రాగి, మక్క కూడుగింజెల సాగుబడి తరిగిపోయే
తరంతరంకు తరిగిపోయే తిండి గింజల ఎగసాయం
గడ్డిగ్రాసం కరువుతోను పశుసంపద తరిగిపోయే
పాలకంకులు కానరాక పక్షిజాతి సన్నగిల్లెను
కాలమే మారిపోయెనని కంటి తడి పెట్టుకున్న
కంది, పెసర, మినుము, ఉలవ పప్పు ధాన్యమే పలసనాయె
పల్లి, కుసుమ, పొద్దుతిరుగుడు పంటలే నాసిరకమాయే
కూరగాయలు, ఆకు కూరల పండ్లలోన పురుగుమందులెక్కువాయే
అధిక దిగుబడి మోజులో ఎండ్రీన్, యూరియా ఎగజల్లుడాయే
తిన్నకూడు వంటికి చేటై లేని రోగం వచ్చిపడే
రోజు రోజుకు సచ్చుడాయే.

# మంచి

మంచిని మరచి ద్వేషాన్ని పెంచుకుని

సాదించేదేముందు మానవుడా

అంతా నాదే నాదే నని భ్రమపడుచున్నావా

ఏది నీకు శాశ్వతము ఎంత వరకు నిశ్చలము

స్వార్థం పొంచి ఉన్నవేళ నిస్వార్థము కొరవడిన వేళ

మితిమీరిన విశ్వాసముతో నిజము మరిచిపోయి

నీతిమాలిన మీరు జాతికి ఉపదేశమా

నేనే గొప్పోడినని భావిస్తే తప్పులేదు

ఎదుటివారిని చులకనగా చూస్తే అది గొప్పకాదు

అంచెలంచెలుగా ఎదగాలని తపన ఉండాలి కాని

అణగదొక్కాలని ఆలోచన సరికాదు.



# పుడమి

పుడమి తల్లి ఒడిలో జీవులు ఎన్నో

జీవరాసులు ఎన్నెన్నో

గనులెన్నో సిరులెన్నో సంద్రాలెన్నో సంగమాలెన్నో

గిరులెన్నో హిమ గిరులెన్నో

సంపదలెన్నో సంపన్నగిరులెన్నో

చిత్రాలెన్నో విచిత్రాలెన్నెన్నో

ఘోరాలెన్నో అఘోరాలెన్నెన్నో

దుఖ:సాగరం ఉప్పెనై పొంగుతూ

అగ్నికీలలు రౌద్ర జ్వాలలై చిమ్ముతూ

ఆవేదన పొరలనుంచి ప్రకంపనలే సృష్టిస్తూ

క్షణమైన ఆగకుండా అన్నింటిని భరిస్తూ

అంతములేని నీలో చిరు ప్రయాణం సాగిస్తూ

చిరు చరజీవులు ఎన్నెన్నో

పుడమి తల్లి ఒడిలో జీవులు ఎన్నో

జీవరాసులు ఎన్నెన్నో

# ఊరూర చెరువు

ఊరూర చెరువు పల్లె పల్లె చెరువు
చెరువుల్లో... చెరువు కుంటల్లో...
వంకల్లో, డొంకల్లో, వర్రెల్లో, వాగుల్లో
జలజల ఈదేటి జలకాలాడేటి
జీవులే జీవ జాతులే
బుడ్డ పరకల గుంపు ఉసికె దొంతుల ఉరుకు
బురద మట్టల మంద హాసం, కొర్ర మేను రాజ విలాసం
రొయ్యబావల భారీ మీసం
బొచ్చె, బంగారు తీగ, మత్స్య సంపద నీలో ఎంతో
సెలగ పిట్టల ఈదులాటలు సందమామల సయ్యాటలు
కొంగ బావల దొంగజపములు
బిరబిరా పరిగెత్తే ఎండ్రకాయలు
వలస పక్షుల కిలకిలా చప్పుళ్లు
గట్టు ఒడ్డున చెట్టు కొమ్మన
చివర నల్లిన పిట్టగూళ్ల గాలి మేడలు
అబ్బుర పరిచే పక్షి యుక్తులు
భావ ప్రకటనలు తెలియకున్నా భవిష్యత్‌కు మార్గం చూపె
శత్రువర్గ పోరులోన ఎత్తుగడలు ఎన్నెన్నో
జీవన పయనంలో ప్రతి జీవి పాట్లెన్నో.



# పరిశ్రమలు

పరిశ్రమలే ఆధునిక దేవాలయాలు
సమ్మెట శబ్దాలే గుడిగంటలై మ్రోగె
ముడిసరుకు ఖనిజ ద్రవ పదార్థాలు
కరగదీసి అచ్చువేసి పోత బోసి
వస్తురూపంగా మలిచే శిల్పులు
తుదిమెరుగుల శ్రమ యుక్తి
అభిషేక అలంకరణ చేసి
అనునిత్యం శ్రమించే శ్రామిక పూజారి
సమాజ అవసరాల కోరికలు తెలుసుకుని
వస్తు సామాగ్రిని ఉత్పత్తులుగావించి
విపణి ద్వారా ప్రజలకు పంపిణీ గావించి
కర్తవ్యం కటువుగా సేవకు మారు రూపంగా
నిత్య శ్రమతో ప్రగతికి సోపానమేసి
సకల వస్తువుల సృష్టికి సూత్రధారివి... పాత్రధారివి.

# నాన్న

నాన్న అంటే నాలోనే భాగం
ఆ భాగమే లేకుంటే ఈ భాగ్యమే లేదులే
కనిపెంచిన భగవంతుడు నాన్న
కంటికి రెప్పలా కాపాడుకునే మా నాన్న
మాటనేమో కఠినము కరిగిపోయే వెన్నలాంటి మా నాన్న మనస్సు
అనునిత్యం ఆలోచన మేము ఎదగాలని
హితబోధతో మాటలేమో పాఠమై నేర్పి
మా బతుకుకే బాట చూపిన మా నాన్న
కష్టాలెన్ని వచ్చినా కన్నీళ్లు దిగమింగి
క్రమశిక్షణ సాధనకై కఠినమే చూపే
మేము గొప్పగా ఎదగాలని తపన చెందె మా నాన్న
పగలంతా కష్టపడి రాత్రంతా కలవరించి
తన బతుకు మరిచిపోయి మా బతుకే తన బతుకని
అడుగడుగు నీతిగా జాతి కొరకు నడక నేర్పి
సంఘంలో గౌరవంగా మాకు బతుకునిచ్చి
మచ్చలేని మనిషిగా మమ్ముసాది
మా ఎదుగుదల చూసి మురిసిపోయే మా నాన్న.



# ప్రపంచం

ప్రపంచమే నాదేలే అని అనుకుంటే ఎవరు కాదంటారు
ఎగిరే పక్షిని ఎవరు ఆపగలరు
జపాన్ అయినా జర్మనీ అయినా
అమెరికా అయినా ఐర్లాండ్ అయినా
ఏదేశమేగినా ఎక్కడ బతికినా ఎవరు వద్దంటారు
ప్రపంచ పటముపై గీతలెన్నో గీసుకున్నా
సరిహద్దులెన్నో ఎంచుకున్నా
ఆకాశాన ఎగిరే పక్షిని ఎవరు ఆపగలరు
సమాజ సేవకోసం శోధనలెన్నో చేసినా
ఆశయ సాధనలో జ్ఞాన ఫలాలను సృష్టించినా
ఐన్‌స్టీన్ ఆల్‌బెర్ట్ అమర్త్యసేన్ లాంటి
అపర మేధావులను ఎవరు ఆపగలరు
శాంతిసాధనలో గౌతమ బుద్ధుడు, అశోకుడు
యేసుక్రీస్తు, ప్రవక్త, గాంధీ లెందరినో
ఎవరు కాదంటారు
మానవసేవే దైవంగా జీవితాలనే ఫణంగా పెట్టిన
మథర్ థెరిస్సా మరెందరినో
మహానుభావులను ఏదేశమేగినా ఎవరు కాదంటారు

# తల్లితెలంగాణ

తల్లితెలంగాణ మా తనువే నీవమ్మ
అనునిత్యం నినుదలచిన అలిపిరే రాదమ్మ
గాలిపీల్చి వదిలినా నీ ధ్యాసనే మాయమ్మ
తెలంగాణ తల్లి నీ తెగువనే మరువమమ్మ
పోరాటాల మన గడ్డ త్యాగాల నీబిడ్డ
ఆకలి కేకల ఆక్రందన పోరాటాల తొలికేక
వలస పాలనలోన అలసిన మాయమ్మ
పరాయి పాలకులకు నీ పేరంటే గిట్టదమ్మ
నీచరిత్ర ఘట్టాలలో ఎన్నెన్నో మలుపులు
గంజి ఘట్క గతులతో బతుకునే ఎల్లదీసి
చారిత్రక కట్టడాల పునాదులు నీ బిడ్డలు
ప్రాణం పోయినగాని వెనకడుగు వేయలేదు
హింస నిరంకుశం బానిసత్వ విముక్తికై
నీ బిడ్డల రోషం పౌరుషాల తెగువతో
వారసుల మేలు కోరి అసువులు బాసిన
అమరుల నెత్తుటి మరకలే నీ నుదుట తిలకమై
పది జిల్లల తెలంగాణ సకల జనుల పోరాటం
అడుగడుగున తెలంగాణ ఆశల ఆరాటం
ముక్కోటి దేవతలకు మొక్కుకున్న ప్రాణమా
తెలంగాణమా...



# ఆకాశం

ఆకాశాన విచ్చుకున్న మేఘమాల
తొలకరి చినుకుల జల్లులే జడివాన
వాన చినుకు తాకగానే పుడమి తల్లి పులకరించే
అమ్మా అని పిలవగానే కన్నతల్లి పరవశించే
చిగురించిన లేత కొమ్మల ఊగిస సయ్యాటలు
విచ్చుకున్న పూ గుత్తుల గుసగుసలు
వీచన పరిమళాల గుమగుమలు
ఒక్కనీటి బొట్టుతోనే ఎన్ని వింతలో
పచ్చనైన తీగ వయ్యారాల ఊగిస సొగసులు
ప్రతి జీవిని అలరించే ప్రకృతి కాంతులు
మానవాళి హృదయాలు మురిసిపోయేను
వనమాలి మనసంతా సంబ్రమాయెను
జాబిలమ్మ వెన్నెలలో మెరిసే మంచు కొండలు
ఉషస్సుల కాంతులలో కరిగే హిమగిరులు
కడలిలో అలలతో ప్రళయ గలగలలు
ఎడారిలోన ఎండే మొక్కకు మంచు బిందువే జీవం పోసే
క్షామములోన క్షేమము కోరి
నీటి చుక్కనే ప్రాణము నిలిపె
నీటి చుక్కను పొదుపుగ వాడి
సాటి జీవికి తోడుగ నిలువు.

# శాంతి

శాంతి సంకేతమనే పావురాన్ని ఎగురవేయి
సమస్త ప్రజానీకం సంక్షేమం కోరుకొనుము
భావితరాలకు నీవు బాసటగా నిలచి
దీర్ఘకాల ప్రయోజనం దృష్టిలో పెట్టుకొని
జయకేతనం ఎగురవేయరా
జనులకు మేలు చేకూర్చరా
ఆకలితో ఉన్న జీవికి నీవు అన్నం పెడితే
ఆదిదేవుళ్లే నిన్ను ఆశీర్వదించును
వంద మంది కౌరవులు ఒక్కటైనా
నీతిలేని చాతగాని ఎందరు ఎదరైనా
మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగరా
బడుగు, బక్క జీవుల బతుకులలోని
నిరాశానిస్పృహ నిరీక్షణలతో
దీనంగా దేహీ అంటూ నోట మాటనే పలకలేక
వాలినట్టి ఆ కనురెప్పలలో
కలకాలం కాంతులు నింపరా
చిరకాలం చిరంజీవుడవై నిలువురా





# హంస

హంస తూలికా తల్పాలమీద శయనించే ఓ చక్రవర్తి
కటిక నేలపై నిద్రించే దీనుల బాధలు చూడవయ్యా
కనకపు సింహాసనముపై కొలువైన ఓ ప్రభువా
కష్టజీవుల బాధలు కనవయ్యా
పంచభక్ష పరమాన్నాలు భుజించే ఓ పరిపాలకుడా
కందమూలాలతో కడుపు నింపుకునే
గిరి జన పుత్రుల బాధలు తీర్చవయ్యా
రాత్రింబవళ్లు తేడాలేక యంత్రాలతో సమానంగా కష్టపడే
కార్మికుల బాధలు తీర్చవయ్యా
రంగురాళ్లనే ద్వేషించకయ్యా
రాళ్లను సానబడితే రత్నాలుగా మారునయ్యా
పేద వాడని చిన్నచూపు చూడకు
ప్రేమతో పలకరిస్తే ప్రాణమే అడ్డేస్తారు.

# బాలలు

బాలల బతుకులు మారలేదు..

పేద బాలల బాధలు తీరలేదు..

పాపం పుణ్యం ఎరుగని పసిమొగ్గలు మన బాలలు

బడికి పోవలసిన బాలలే బండ చాకిరికి బానిసలాయే

రెక్క ముదరని డొక్క ఆడని చిన్ని చిన్ని చేతులే బండ బారెనా

నేతలెందరు మారినా.. చట్టాలెన్ని చేసినా..

నేటి బాలలే భావిభారత నిర్మాతలని చెప్పి

బాలల దినోత్సవం భారీగా జరిపిన

బాలల బతుకులు మారలేదు

భవిష్యత్‌కు దారి చూపలేదు

ఖార్ఖానాల్లో బతుకు బండిని గుంజి

చితికిన బతులకులతో సతమతమవుతూ

ఆకలి బాధతో కేకలు వేసి

చెత్తకుండీలపై శునకముతో సమానముగా

భుక్తికోసం వెతుకులాడే

నేటి బాలల పరిస్థితి.. పేద బాలల దుస్థితి.





# మహా భాగ్యం

మంచి మనస్సుతో... స్వచ్ఛమైన నవ్వుతో

కపటము లేని ప్రేమతో పలకరించే పలకరింపే

మహా భాగ్యము... మహా భాగ్యము.

కక్షసాధింపులేని... పొగడ్తలకు లొంగిపోని

విమర్శలకు కుంగిపోని నలుగురిని ఉద్ధరిస్తూ

మంచి పేరును తెచ్చుకుంటూ... జీవించే జీవనమే మహా భాగ్యం.

సమస్యలకు సతమతమవ్వక... ధీటుగా ఎదుర్కొంటూ

క్షణక్షణం భయపడక... అనునిత్యం ఆలోచించక

ప్రపంచానికి వెలుగునిచ్చే... మానవ జన్మయే

మహా భాగ్యము మహా భాగ్యము

బతుకు దెరువుకోసం... పరిశోధనలేచేస్తూ

ఆహర్నిశలు శ్రమిస్తూ... ఆనందంగా జీవించే జీవనమే

మహా భాగ్యము మహా భాగ్యము

కఠినమైన మాటలతో... ఎదుటి వారిని నొప్పించక

చెప్పుడు మాటలు విని చెడ్డదారి పట్టక

సమిష్ఠిగా శ్రమ జేసి... నమ్మకంగా జీవించే జీవనమే

మహా భాగ్యము మహా భాగ్యము

అభ్యుదయ భావాలతో... అక్షరాల మాలలల్లి

శాస్త్రవిజ్ఞానముతో... సాంకేతిక విద్యతో

సృష్టిలో పర సృష్టి సృష్టించడమే

మహా భాగ్యము మహా భాగ్యము

# మహిళ

మహిళా ఓ మహిళ...

చక్కటి ఆలోచనతో సమయస్ఫూర్తితో

ఉండి... లేమిడితో... ఓర్పుతో.. నేర్పుతో...

సంసారాన్ని ఎళ్లదీస్తూ... సహచరిణిగా జీవిస్తూ ||మహిళ||

కష్టసుఖాలకోర్చి కాపురం చేసుకుంటూ

మెట్టినింటికి మేలు జరగాలని

కన్నవారికి పేరుతేవాలని ఆరాటపడే ఆడపడుచు

ఉన్నత విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు ఎదిగి

పురుషునితో సమానంగా అన్నింటిలో ముందంటూ

ప్రగతి పథంలో అడుగడుగు ముందుకేస్తూ

నవ భారత సారథుల్లో మొదటి వ్యక్తులై ఉంటూ ||మహిళ||

కష్టాలెన్ని ఉన్నా కంఠంలో దాచుకుంటూ

భాదలెన్ని ఉన్నా భావ ప్రకటన చేయక

ఆడంబరంగా అందరితోనూ కలిసి

జీవన సమరం చేస్తూ ప్రమిదలా వెలుతురునిస్తూ ||మహిళ||



# ప్రాశ్చాత్య సంస్కృతి

ప్రాశ్చాత్య సంస్కృతి ప్రభలుతుంది

మన నగరంలో భాగ్యనగరంలో

తళుకు బెళుకువల కాంతుల వలయంలో

పబ్బులలో, క్లబ్బులలో, కురుచైన దుస్తులతో

విలాసమైన జల్సాలతో రకరకాల వ్యసనాలతో

మత్తులోన మునిగి చిత్తుగా ఆడి–పాడి

గమ్మత్తైన మాటలతో ||ప్రా||

ఆప్యాయతలే మరిచి... అనురాగమే విడిచి

మర్యాదలే మరిచి... సాంప్రదాయమే విడిచి

మిడిమిడి జ్ఞానంతో... మిడిసిపాటు గర్వంతో

రంగులెన్నో నింపుకుని... నటనలెన్నో ఆడి

పైపై మెరుగులకోసం ప్రాకులాడుతున్నారు ||ప్రా||

# చెలిమి

సప్తవీణ మ్రోగించడం ఎంతకష్టమైనదో

చెలిమిని పెంచుకోవడం అంత కష్టమైనది

సప్తవీణ మ్రోగించితే ఎదుటివారికి ఆనందం కలుగుతుందో

చెలిమిని పెంచుకోవడం తనకు తాను తృప్తినొందుతారు

సప్తస్వరాలు మారనివి చెలిమి బంధం చెదరనిది

వీణ చెడిపోయినా సప్తస్వరాలు మిగులుతాయి

మనిషి చనిపోయినా మంచితనం మిగులుతుంది

వీణకు ఉండాలి తీగలు... మనిషికి ఉండాలి మనస్సు

వీణకు తీగలుంటే సప్త స్వరాలు మ్రోగుతాయి

మనిషికి మనస్సు మారకుంటే చెలిమి బంధం నిలుచును



# చిన్నమొక్క

ఒకనాటి మొక్కే నేటి మహా వృక్షం
విషవాయువులనే పీల్చి... ప్రాణవాయువులను ప్రసాదించి
పచ్చటి ఆకులతో ప్రకృతినే ప్రసాదించిన
ఆ చిన్ని మొక్కే మహావృక్షం
చల్లని నీడనిచ్చి చక్కటి గాలినిచ్చి
వరుణ రాకకొరకు స్వాగతమే పలుకుతూ
బాటసారులకు బాసటగా అలసట తీర్చే
ఆ చిన్న మొక్కే మహా వృక్షం
పుష్పాలనందించి పరిమళాలను వెదజల్లి
ప్రేమానురాగాలకు సందిగా నిలిచి
దేవుడి సన్నిధికి చేర్చే ఆ చిన్ని మొక్కే మహావృక్షం
సకల ప్రాణులకు ఆకలి తీర్చి... ప్రజలందరికి ఫల సంపదనిచ్చి
కళారూపాలకు కాంతులనందించే...
ఆ చిన్ని మొక్కే మహావృక్షం
రాతియుగము నుంచి నేటి యుగము వరకు
వాడిపోయి ఎండిపోయి సమిధలుగా మిగిలిపోయి
నిర్జీవమైన మానవ శరీరాలను
తనలోన ఖననం చేసుకున్న
ఆ చిన్ని మొక్కే మహావృక్షం

# ఎంతో విశాలమైంది

ఎంతో విశాలమైంది విశ్వం
ఎంతెంతో విశాలమైంది విశ్వం
కోట్లాది కోట్ల జీవరాసుల నిలయం
కొత్తకొత్త జీవరాసుల ఆలయం
ఎన్నో జీవులు పుట్టుకొచ్చినా
ఎన్నో జీవులు కనుమరుగైనా
తరతరాలు ఎన్ని మారినా
తరగని ఈ విశ్వం ॥ఎంతో॥
ఎంత గొప్ప జీవి అయినా
ఎంత వింత జీవి అయినా
శాశ్వతం కానిది జీవితం
విశ్వంలోనే విలీనమయ్యే
ఎన్ని శోధనలు చేసినా
ఎన్నెన్నో పరిశోధనలు చేసినా
పట్టెడన్నం కోసం ప్రాకులాటేనని
ఎన్ని రూపకల్పనలు చేసినా
ఎన్నెన్నో ప్రయోగాలు చేసినా
ప్రకృతి ముందు పనికి రావని
కాలగర్భంలో కలిసిపోయేవని
నిజం తెలియక మానవుడు ఊగిసలాడుతున్నాడు.



# కలియుగం

కలియుగం ఇది కపటయుగం
మనిషిముందు ఒక మాట
మనిషి వెనక మరో మాట
ఏది సత్యం... ఏది అసత్యము
పెట్టినవారినే తిడతారు (కొందరు)
చేసేవారినే తప్పుపడతారు (కొందరు)
కాసే చెట్టుకు రాళ్లు విసురుతారు
పూసే చెట్టుకొమ్మలు విరుస్తారు
నిజం చెబుతే తప్పంటారు...
అబద్ధం చెబుతే గొప్పంటారు..
అన్యాయం అని అరవకురన్న
న్యాయమని నీవు మొరగకురన్న
పేదవాడు ప్రేమగా పలకరిస్తే
పనేముందని దిక్కులు చూస్తారు
నడమంత్రపు సిరితో స్నేహం మరిచి
పైపై మెరుగులతో పెదాలపై చిరునవ్వు
ఎవరు దిక్కులేనప్పుడు నీవే దిక్కంటారు
నలుగురిలోన నా అంత వాడెవరని అంటారు
గొప్పలేమో చెబుతారు... గంబీరాలు పలుకుతారు
సాక్ష్యం కావాలంటే చదువుకోండి
నేత్రసాక్ష్యం కావాలంటే చూసుకోండి

# రాజకీయం

ఓట్ల రాజకీయం ఇది నోట్ల రాజకీయం
అధికారం కోసం ఆరాటపడుతూ
అందరితోనూ మెప్పు పొందాలని చూస్తూ
గంటకో మాటమార్చి పూటకో వేషం వేసి
కపటమంత లోన ఉంచి ముసిముసి నవ్వులు నవ్వి
ప్రజాసేవకై నాయకుడైపోవాలని
ఉబలాట పడతారు... ఊరూర తిరుగుతారు.
అధికారంలో లేనప్పుడు అందరు గుర్తొస్తారు
రైతు బాధలంటారు.. కూలిబాదలంటారూ
పేదోళ్ల పక్షాన పోరాటమంటారు
ఏటేట పార్టీలు మార్చి వేషాలెన్నో వేసి
"సారబోసి, బీరుబోసి, కల్లుబోసి, విస్కీబోసి"
మాయమాటలతో మత్తులోన ముంచేసి
అడ్డదారిలోన రిగ్గింగులే చేసి
అక్రమదారిలోన అధికారంలోకి వచ్చి
కల్లబొల్లి టెండర్లతో కాంట్రాక్టులే కొట్టేసి
నాసిరకం పనులు చేసి నానా కమిషన్‌లు కొట్టి
పార్టీ ఫండు పేరుతో నల్ల ధనాన్ని దాచేసి
అసెంబ్లీ సమావేశాల్లో ఆరాటమెక్కువాయే
కెమెరా ముందుందని ఫైటింగులే చేసి
ప్రజల ధనాన్నంతా పాడుజేసేసి
ఆ కాస్త సమయాన్ని ఆవిరి చేస్తారు.



# తల్లి నీకు వందనం

తల్లి నీకు వందనం.... భరతమాత నీకు వందనం
సమర యోధుల్లారా మీకు వందనం... వందనం
అరవైఏండ్లు గడిచినా స్వతంత్ర్య భారతావనిలో
సగటు పేద జీవులు దిక్కు తోచకున్నారు
భావితరాల కొరకు వీరులు త్యాగం చేయగా
నీతి మాలిన వ్యవస్థలో అవినీతి అందలమెక్కి
నీతినేమో ఎక్కిరించి అవినీతి సయ్యాటలాడే
జాతిక్షేమమంటూ భరత జాతి కోసమంటూ
అభివృద్ధి కోసమని అప్పులెన్నో జేసి
పథకాల పేరుతో పంపకాలే జరిపి
భారతీయుల బతుకుల మీద భారమే మోపినారు
గాంధీ, నెహ్రూ, చంద్రబోసు, వల్లభ భాయి, లజపతి రాయ్,
భగత్‌సింగ్, ఆజాద్, అల్లూరి, కొమరంభీం, సర్వాయి పాపన్న
సమరశీలులెందరో... పరాయి పాలన అంతముకై
సమరమేమో నడిపినారు
తమ నెత్తుటి ధారలతో భూతల్లిని ముద్దాడిన
మహనీయులెందరో అమరులై నిలిచారు.
తల్లి నీకై తల్లడిల్లిన వీర వనితలెందరో ॥తల్లి॥

# శాంతి

శాంతి... మన:శ్శాంతి... విశ్రాంతి..

అధికమైన ఆశలేకుంటే అదియేను శాంతి

ఉన్నదానిలో తృప్తిపడితే అదియేను శాంతి

ద్వేషం... కపటం లేకుంటే అదియేను శాంతి ॥శాంతి॥

అధికమైన భారముంటే లేదులే శాంతి

అల్లరిపాలైతే లేదులే శాంతి

ఆపదలో మనస్సుకు లేదులే శాంతి

ఆశించింది జరగకుంటే లేదులే శాంతి

ఆదిదేవుడిని తలచుకుంటే అదియేను శాంతి

ఆరోగ్యంగా ఉంటే అదియేను శాంతి

కార్యదీక్షలో సఫలమైతే అదియేను శాంతి

భక్తిలో పరవశించిన అదియేను శాంతి

భాద్యతనుండి విముక్తి పొందిన అదియేను శాంతి

భగవత్‌ముక్తి నొందిన అదియేను శాంతి

రుణగ్రస్తులై లేని యెడల అదియేను శాంతి

కలిసిమెలసి ఉంటేను అదియేను శాంతి

సహకారం మమకారం సంయమనం ఉంటే అదియేను శాంతి



# మాత

మాత, భూమాత, గోమాత, జగన్మాత

అనురాగం ఆప్యాయత... ప్రేమా మమకారం

అన్ని కలబోసినదే మాత, మాత లేనిదే జన్మమేది.

భూమాత లేనిదే సర్వం సృష్టిలేదులే

గోమాత లేనిదే హిందూ ధర్మమేది

సర్వసకల జీవులకు మూలం మాత

విశ్వంలో ప్రతి జీవికి మాతనే మూలం

అన్నింటికి మూలం ఆదిశక్తియే

అనంత కోటి జీవులకు అమ్మనే ఆధారం

సర్వ సృష్టికి మూలం భూమాతనే జగన్మాతనే

అమ్మఒడి మొదలు ఆకాశం అంచు వరకు

అమ్మఒడి విశ్వంగా ఆనంద డోలలూగగా

భూగోళం అంచుదాటిన ఆకాశంలో ఆధారమేది

ఖగోళ మండలంలో ఎన్ని గ్రహాలు ఉన్నా

అనంత కోటి నక్షత్ర మండలాలెన్నున్నా

జీవ సృష్టికి జవసత్వం శూన్యమేను

అనునిత్యం భూతల్లిని ఆరాధన గావించరా

సకల జీవుల భుక్తికి భూతల్లేనని మరువకు ॥మాత॥

# పుణ్యభూమి

పుణ్యభూమిపై అడుగేయ్యంగ
పులకరించెను మా తల్లి భూతల్లి
మహాతల్లులకు పురుడోయ్యంగా
మహాత్ములెందరో జనియించిరి
పోరుగడ్డపై వీరవనితలే పోరాటం చేయంగ
ధీరమాతయై పరవశించెను మా తల్లి భూతల్లి
వీర మాతలకు పురుడోయ్యంగా
వీరులెందరో జనియించిరి
పోరులోనా వీరులెందరో ప్రాణాలే అర్పించగ
పోరుబిడ్డల వీర శూరుల ధైర్య సహసం తిలకించగా
గుండెకద్దుకుని గర్వించె మా తల్లి భూతల్లి
వీరాధి వీరులను గన్న, పోరాట యోధులను గన్న
సమరయోధులను గన్న, మా తల్లి భూతల్లి.
రాచరిక పాలనలోన వీరాధి వీరులే మిన్న
నిరంకుశ పాలనలోన పోరాట యోధులే మిన్న
సుపరి పాలన కొరకు సమర యోధులే మిన్న
తెలంగాణ సాధనలోన అమర వీరులే మిన్న
అన్నింటికన్న మిన్న మా తల్లి భూతల్లి
మా తల్లి తెలంగాణ తల్లి.



# తల్లిప్రేమ

తల్లిప్రేమకు వెల కట్టగలమా?
ఎంత గొప్ప మహారాజైనా ఎన్ని కోట్లు సంపాదించినా
తల్లిప్రేమకు వెల కట్టగలమా.
నవ మాసాలు కడుపున మోసి
పురుటినొప్పుల అనుభూతులతో
కాన్పు కాన్పుకు మరో జన్మని తెలిసి
మనకు జన్మనిచ్చిన తల్లి ప్రేమకు
పేగుతెంచి... పాలిచ్చి... లాలించి పెద్దవాన్ని చేసి
తొలిగురువై మాటలే ఒలికించి.. పలికించి
విద్యాబుద్ధులతో జ్ఞానాన్నే బోధించి
అంచెలంచెలుగా అనంత విశ్వానికి
పరిచయం చేసిన మన తల్లికి
మహా తల్లికి వెల కట్టగలమా..

# వేగుచుక్క

వేగుచుక్కలమై వెలిగాము - కార్మిక శ్రమ జీవులమై నిలిచాము
అహర్నిశలు అన్ని రంగములలో తొలి అడుగేసి పయనించాము
కులము, మతము, ప్రాంతం భాష తేడాలు లేవు మాలోన
కార్మిక, కర్షక శక్తి దేశానికి వెన్నుపూసై నిలవగా
సమస్త జనావళికి తోడై నిలవగా
ఆయిల్, పెట్రోలు, ఔషధం మొదలు
అంత రిక్ష నౌకల దాకా
భూగోళం నుంచి ఖగోళపు అంచులకు
ఉపగ్రహ సాధనతోనూ శోధన చేసి
ఇనుము, ఉక్కు లోహాలెన్నో
వేరు చేసి కరగబోయి
ఇత్తడి, కంచు, రాగి, వెంగి, బంగారు, రాసులతో
దేశ సంపదకు మూలం మేమై
నీతిగ జాతిగ బతికేవాళ్లం
శ్రమజీవులం కార్మిక శ్రమ జీవులం



# సేంద్రీయఎరువు

సేంద్రీయ ఎరువుల - సేద్యము ఏదయ్య
గొడ్డుగోదా లేక - పెంటకసువు ఏమాయే
పంట పొలమును చూడ - పైరు ఎదగదాయే
చాటెడు ధాన్యంబు - రోట్లోన దంచగా
పిడిక కట్టెలు పెట్టి - మట్టి కుండల్లోన
పొయ్యిమీద వండంగ - పొంగిన ఆ ఎసరు
కమ్మనైనట్టి ఆ నాటి ఆ కూడు
కానరాక పాయే - కనుమరుగైపాయే
జొన్న ఘట్క కూడు - సజ్జ బువ్వ రుచులు
కమ్మటి కూడుతో కడుపు నిండిపోయే
చింత చిగురు, వట్టి చాపల వేపుడు
బుడ్డపరక - ఉప్పు దొంతుల రుచి
దోస ఒరుగులు - వట్టి తునకల కూర
నాల్కకు రుచాయే - వంటికి బలమాయే
దోస బుడమ కాయ - అడవి కాకరకాయ
ఆనకాయ - అన్నుకాయ - చెమ్మకాయ
కందికాయ - పచ్చిపెసరు కాయ - వేరు చెనక్కాయ
కాల్చి తినంగ - కడుపే నిండిపోయే
మక్క జొన్న - సజ్జ కంకుల రుచి
పాలకంకుల రుచి - ప్రాణమే పోసేను

# ఆదిమానవులు

ఆది మానవుల వారసులం - అడవి తల్లి బిడ్డలం
పోడు ఎగసాయంతో - పొట్టపోసుకునేటోళ్లం
పండుగంటె తెలవదు - పాయసం అంటే ఎరుగం
కల్లబొల్లి మాటలాడం - కపటమేమో తెలవదు
మాయలేమో తెలవవు - మర్మమేమో ఎరుగం
చీకటితో లేచి షికారు జేసి - మాటు వేసి వేటాడేవాళ్ళం
కడుపు నింపుకునేటోళ్లం - కమ్మని రుచెరుగం
చదువులేమో తెలవవు - సంతకం ఎరుగం
రాతపూతలెరగకున్నా - మాటకు కట్టుబడేటోళ్లం
తేనెపట్టు చింత పండు - ఇప్పపువ్వు చీపురు పుల్ల
ఏళ్లు సెలఏళ్లు - పచ్చనైన ప్రకృతి అందం
నెమళ్లు పురివిప్పి నాట్యమాడంగ
కుందేళ్లు లేళ్లు గంతులేయ్యంగ
కమ్మనైనట్టి కోయిల కూతలు
కనువిందు చేసేటి పక్షుల గుంపులు
ఆకాశానంటేటి చిగురుటాకుల మంద
ఆకు పొదల మాటు పిందె కాయలు జూసి
సంబ్రమాయెను కడుపు నిండేను
అన్ని జీవులకు కూడు గూడుగ నిలచి
ఆనాటి యుగపురుషులు సంచరించారిచ్చట
త్రేతాయుగమున సీతకాశ్రయమిచ్చి
ద్వాపర యుగమున పాండవ వనవాసం
ప్రకృతి వరమైన పర్ణశాలల నిలయం
ఆదిమానవుల వారసులం అడవి తల్లి బిడ్డలం





# వీరుడు ధీరుడవై

వీరుడవై ధీరుడవై రొమ్ము విరిచి నిలవరా
జాతి కొరకు నీతిగా జాగురతగా సాగరా
కనురెప్ప వాల్చకుండా కవాతులే చేయరా
సరిహద్దు దేశాల స్నేహమే కోరరా
మానవాళి మనుగడలో సుఖశాంతులు నింపరా
రాత్రింబవళ్లు నిఘావేసి దేశాన్ని రక్షించరా
శత్రుమూకలపై బందూకులెక్కు పెట్టరా
తన బతుకు తనది కాదని దేశానికే అంకితమిచ్చిన
వీర జవానులారా... దేశ రక్షకుల్లారా వందనం
మిమ్ముగన్న తల్లులకు పాదాభివందనం
సరిహద్దు కంచె వేసి కనుచూపు నిఘావేసి
రణఘర్షణ భారీ నుండి రాజ్యానికి రక్షణగ
అనునిత్యం క్షణక్షణం భద్రత ఆలాపనలో
మంచు గాలి చలిని లెక్క చేయక
సాగుతున్న సైన్యం మనందరి కవచం
నిరంతరం శ్రమతో జాతికి హారతులై వెలిగినారు.
వెలుతురులో జాతి వాసులకు జీవన శాంతి నిలిపినారు
పరమవీర, అశోక్, కీర్తిచక్రాలై మిగిలినారు.
జాతి మేలుకోరి వీరపుత్రులై నిలిచినారు. వీరుడు ధీరుడవై

# ప్రకృతి

ఎంతెంత వర్ణించిన ప్రకృతిని
ఏమని వర్ణించినా...
తనివితీరదాయే తపన ఆగదాయే
మరో జన్మెత్తిన ఈ అనుభూతి
మరుపురానిదాయే మరువలేనిదాయే ॥ఎంతెంత॥
పంచభూతాల్లో ఎన్నోన్నో వర్ణాలు
కొండల్లో కోనల్లో ఎన్నోన్నో అందాలు
ఆకాశానంటేటి ఆ గిరుల శిఖరాలు
గిరుల అంచుల్లోంచి జారులై పారేటి
జీవనదులెన్నో జలజీవనదులెన్నో ॥ఎంతెంత॥
కనరాని లోయల్లో ఎంతెంతో జీవం
కనుపాపకు కూడా కానరాకపాయే
తీరొక్క వనముతో అడవి సంపదెంతో
పూలవనముతోటి పుడమి అందాలెన్నో ॥ఎంతెంత॥
కనురెప్ప మూయక అందాల వీక్షణం
ముద్దులొలికేటి అద్భుత ఆకృతులు
ప్రకృతిని వర్ణింప చాలునా నా తనువు
సాహసిద్దమైన జీవుల అరుపులు
ప్రకృతిని అలరించే సంగీత సవ్వడులు
సెలయేరు అలలతో శబ్దాల సరిగమలు
వీణులకు విందులై మనస్సుకు పసందులై ॥ఎంతెంత॥



# కళాకారులు

బతుకుదెరువు పయనములో – ఆకలి దప్పుల ఆక్రందనలో
పూట తిండికొరకు పుట్టుకొచ్చిన కళలు ఎన్నెన్నో
కళాకారులు వీరేనండి – కళలన్ని వీరివేనండి
కళలతో కడుపు నింపుకునే వారు వీరేనండి
ప్రకృతి పరమైన తాటాకు ఈతాకు
బుట్టలు, గంపలు అల్లిక, అద్దకం
రంగు రంగులతోనూ రమ్యము గొలిపే
నూలుపోగులు నేర్చి బట్టగా నేసి
రంగు రంగులతోనూ రంగవల్లికలల్లి
మట్టి ముద్దతో మైమరపించే ఆకృతులు
చెక్క కొయ్య బొమ్మలు కొలువులే తీరంగా
సాగర తీరాన ఇసుక తిన్నెల మీద
సైకత కళాకృతుల సంబ్రమేనాయే
మైనపు బొమ్మలో మహత్తరాలెన్నో
ఇత్తడి, రాతెండి, రాగి, కంచు
లోహము అంచుల్లో అందాలెన్నెన్నో
శిలలపై మొలలతో అందాల శిల్పాలు చెక్కి
చరిత్రను ప్రతిరూపాలుగా మలచిన
కుంచెతో అలికిన కళాఖండాలు కనువిందు చేయగా
జీవముట్టిపడే కళల వెనక
కడుపు నిండని కళాకారులెందరో.

# రథసారధులు

పారిశ్రామికవేత్తల్లారా

జ్ఞాన సంపన్నుల్లారా

విజ్ఞాన రథ సారధుల్లారా

సిరి సంపదతో లోకాన్ని ఏలేటి

కోటాను కోట్ల ధనము సంపాదించినా

ప్రగతి పథంలో పయనించనప్పుడు

ఫలితమేమున్నది... ప్రజలకు సేవ ఏమున్నది.

బఫ్ఫెట్, బిల్‌గేట్స్, టాటా, బిర్లా,

అజీత్‌ప్రేమ్ లా ఆదర్శప్రాయులై నిలవాలి

సేవా స్ఫూర్తితో మెలిగి ఎదగాలి

మరమనిషిగ కాక మనస్సున్న మహారాజులా

భాగ్యశాలులై మీరు బతకాలి

కీర్తిమంతులై మీరు లోకములో నిలవాలి

నవీన పద్ధత్తుల్లో నాణ్యమైన ఉత్పత్తి కొరకు

శోధించి సాధించే సౌభాగ్యులు మీరు

రాబోయే కాలానికి కాబోయే మార్గదర్శులు

నడుస్తున్న ప్రగతికి చరిత్ర సోపానాలు మీరు



# ఉపాధ్యాయుడు

ఉపాధ్యాయులై ఉద్యమించాలి

సత్యం ధర్మం బోధించాలి

అనంతం ఈ విశ్వమని

మలి గురువు నీవే అయ్యి

అక్షరం మల్లెల పూదోట మాలివి నీవై

సువాసనలు వెదజల్లె విద్యార్థులనే పూలమొక్కలుగ పెంచి

ఆధునిక సమాజానికి జ్ఞాన పరిమళ పునాదులు వేయాలి

తాండాలు, గూడెంలు, పల్లెలు, కుగ్రామాలలో

అమాయకుల గుండెల్లో అత్తుకుని నిలవాలి

వేతనమే కాదు వెతుకులాడే జీవులకు

బతుకు దెరువు మెతుకువై కడుపు నింపాలి

నీ లక్ష్యం నెరవేరునని నీ జాతి మేలు కోరి

అనునిత్యం మేలుకొలిపి అమరుడవై నిలవాలి.

# చారిత్రక జ్ఞాపకాలు

అలుపెరుగని మానవుడా శ్రమించే జీవుడా

పుడమిపై కట్టడాలు చారిత్రక జ్ఞాపకాలు

పూర్వీకుల పోకడలు పురాణ పుటలుగా

సరస్వతి గుడులే బడులుగా బాసిల్లె

తరతరాల గొప్పదనం భద్రపరిచే భాండాగారం

జాతి ఉన్నంత వరకు జనం ఉన్నంత వరకు

రాబోయే తరాలకు కాబోయే స్ఫూర్తినిచ్చి

పతనమెంతో గావించి పరిశోధనలెన్నో జేసి

పురాతన గాధల ఉనికిని కాపాడుకుంటూ

తాళపత్ర గ్రంథాలలో చరిత్రలే భద్రపరిచి

భావితరాలు గర్వించే జాతి వెలుగువై నిలిచి

నిరంతర శ్రమలో పరితపించే శోధనలకు

సర్వదా కృతజ్ఞతలు మీ సాహసాలకు.



# మైకం

మైకంలో ఉన్నప్పుడు ప్రపంచమంతా

అందంగా ఉందనుకోవడం పొరపాటు

కోరుకున్నది ఫలించినప్పుడు ప్రపంచమంతా

అందంగా ఉందనుకోవడం పొరపాటు

తాను సుఖంగా బ్రతికినప్పుడు ప్రపంచమంతా

అందంగా ఉందనుకోవడం పొరపాటు

తాను శ్రమించినప్పుడు ప్రగతి సాధించినప్పుడు

అందంగా ఉందనుకోవడం అది నిజమే లే

ప్రకృతిలోని అందాలను ఆస్వాదించినప్పుడు

మనస్సుకు కలిగిన ఆనందమే నిజమైన అందం

సాహసించి సాధించి తృప్తిగా బ్రతికినప్పుడు

ప్రపంచమంతా అందంగా ఉందనుకోవడం అది నిజమేలే

# భక్షించు

బక్కచిక్కిన ఎద్దును చూసి
డేగ కన్నువేసేను
ఏమి చేయలేని ఎలుకను చూసి
పిల్లికి సంబరమాయెను
జింక మందను చూసి
చిరుత పొంచి వేగమే పెంచె
మధమెక్కిన ఏనుగును చూసి
నీటిలోని మొసలి పట్టు పెరిగే
దుప్పిలేళ్ళు, వన్యప్రాణులను చూసి
పులి, సింహాలు పంజ విసరగా
అడుగు బొడుగు తిండికి అఱ్ఱులు చాచి
నక్క, తోడేలు అరణ్యమే తిరుగగా
జల జీవరాశులపై తిమింగలం దెబ్బ
పురుగుబూసిపై ఉడుము దండెత్తగా
పిట్టగుడ్లపై పాములు పసిగట్టే
మూగ జీవాల కంటే మానవుడి మనుగడ
వింత వింతలు గొలిపే అజ్ఞానమయమై
అన్ని జీవులను భక్షించుచుండే.



# గమ్యం

జీవన పయనంలో లక్ష్య సాధనలో
గమ్యమెపుడు చేరునో ఎవరికేమెరుక
నిరుద్యోగమనే సంద్రాన ఉపాధి అనే నౌకకు
ఉద్యోగమనే దిక్సూచి దిక్కులను చూపక
జీవిత గమ్యం ఏదరికి చేరునో
నిరుద్యోగ పయనం అలలే ఉప్పెనై
ఆత్మాభిమానమే మౌన సాగరమై
ఆకలి కేకలు కెరటాల సవ్వడై
ఎత్తిపొడుపు మాటలు
సాగర పవన హోరులై
ఉపాధి లేని జీవితం అనుక్షణం ఆర్తనాదమై
ఆకలి మంటలు అగ్నికీలలై ప్రజ్వరిల్లి
అవినీతి అనే చీడపురుగు చితిలో భస్మమై
ఉద్యోగమనే దిక్సూచి దిక్కులు చూపి
యువతర శక్తి ప్రగతికి సోపానమై
రేపటి సమాజం కొరకు నాంది పలకాలి

# ఆనాటి ఫలములు

ఆనాటి ఫలముల ఆ రుచులేవి

ఆనాటి రుచుల మాధుర్యము లేవి

ప్రకృతి ఇచ్చిన ఫలములేమాయే

నాటు పండ్ల రుచి నాల్కకు కరువయా

మాధుర్యమైనట్టి మకరంద రుచులేవి

ఈత పండ్ల రుచి ఇసుమంతా లేదాయే

జామపండ్ల రుచి చచ్చుబడిపోయే

చీమచింత కాయ వగరు మరిచితిమి

ఇరుకుపండ్ల ఉనికి ఇలలోన కరువాయే

మేడిపండ్ల మేలిమి కంటికి కనరాక

సపోటా పండ్లేమో సంకర జాతిగ మారే

సీతాఫలములే వక్కివారీ పాయే

పొప్పడి, మామిడి, అరటి, అనాస

అల్లనేరేడు, పనస, బత్తాయి, నారింజ, కమలాలు

దానిమ్మ, రేగు, గంగిరేగు, ద్రాక్ష పండ్లేమో

హై బ్రీడు మాయలో "ఆ"రుచులు కరువాయే



# భగవంతుడా

భగవంతుడా నీకివే నీరాజనాలు

జీవిత యాత్రను నడిపించే సూత్రధారివి

శాశ్వతం కాని ఈ జీవితాలకు

ఎన్నెన్నో ఆశలు పుట్టించావు

ఆశల వలయంలో చిక్కుకున్న చిరుజీవులం

తప్పేదో ఒప్పేదో తెలియని వాళ్లం

పుణ్యమేదో పాపమేదో మంచేదో చెడేదో

మలినంలో మునిగినట్టి మట్టి మనుషులం

దేహంలో మనస్సున్నా మనస్సు వేరు దేహం వేరు

అందమైన దేహాలకు ముగ్దులను చేసి

సంసార సాగరంలో దిగ్బందించి

ఆటలేమో ఆడిస్తున్నావు నీవు

సూత్రధారివై నడిపిస్తున్నావు

భగవంతుడా నీ కివే నీరాజనాలు

# అనునిత్యం

అనునిత్యం శోధనతో అలుపెరుగని జీవులు
సమయంతో పోటీపడి సంపదనే పెంచితే
అక్రమంగా దొరికిందని ఆరగించే వారు వేరే
ఎన్నినాళ్లు శ్రమించిన ఏమున్నది ఫలితం
ఆలసిన ఈ జీవులకు ఉప శమనం అరుదేనా
కంటినిండ నిద్రలేక కడుపు నిండ కూడులేక
కంటిలోని తడి కనురెప్పను దాటలేక
లోలోన ఇంకి లౌక్యమే మిగిల్చే
బరువెక్కిన గుండె నిండ బాధనెంతో దాచుకుని
జీవన సమరంలో జాతి గర్వించే
మానవ జాతి మినుగురులై
ప్రగతి వెలుగులు విరజిమ్ముతూ
అనునిత్యం శోధనలో అలుపెరుగని జీవులు.



# తనబిడ్డలు

తనబిడ్డలు తనపై ఆటలాడుకుంటుంటే
ఏ అమ్మకైనా ఎంత ఆనందమో
ఎంత ఆడుకున్నా ఎన్ని గంతులేసినా
అంతకు మించిన ఆ... ఆనందం
పశుపక్షాదులు, జీవజాతులు ఏ ప్రాణిలోనైనా తల్లి ప్రేమ తరుగునా
సకలకోటి ప్రాణులకు నిలయమైనట్టి
పుడమి తల్లి కడుపుకోతకు కారకులం మనమై
జల, వాయు, దుమ్ము, ధూళి, కాలుష్యం పెంచేసి
అమ్మకు అమ్మనైన భూమాతను బాధించి
సకల కోటి ప్రాణుల మనుగడే సంకటమై
గొప్పలెన్ని చెప్పుకున్న ఒరగబెట్టేదేముంది
రాబోయే తరాల మనుగడే మరిచితే
పట్టేడన్నం కొరకు పుట్టెడు పాపం చేస్తే
చరిత్ర హీనులమై మిగిలిపోతాము
పర్యావరణాన్ని కాపాడుట ప్రతి మనిషి బాధ్యత
కాలుష్యం తగ్గించి పుడమి తల్లి మేలుకోరుకో
ఎవరి ధర్మము వారు తెలుసుకుంటే
ఆధర్మమే భావి తరాలకు బాసటగా నిలిచును.

# కొలిమి

ఆలోచన కొలిమిలో మెదడుకే పదును పెట్టి

అలసట లేకుండా అనునిత్యం వెదుకులాట

నిత్య శోధనలో అలుపెరుగని పరిశోధకుడా

విరామం లేని శ్రమజీవివై ప్రయోగాలెన్నో జేసి

సాధించాలనే ప్రతిదానిని క్షుణ్ణంగా పరిశీలించి

సంకల్పమనే జ్ఞాన బుద్ధి నవ నిర్మాణ సాధనలో

సమయం విలువ తెలుసుకున్న సమర్ధుడవు నీవై

జరిగిపోయిన రోజు తిరిగి రాదని తెలుసుకుని

సృష్టిలోని  ప్రకృతి సంపదను పలు రకాలుగా వేరు చేసి

రాబోయే కాలానికి కాబోయే అవసరాలు కనిపెట్టి

భావితరాలకు భృతిరాసులు ప్రోగు చేసి

సమాజ సేవలో సజీవ శాస్త్రజ్ఞుడవై

కలకాలం చిరంజీవుడవై వెలిగిపో.



# నీతిమాలిన

నీతిమాలిన వ్యవస్థలోన

జాతికే విలువలేకపోయేను

రాజకీయ రణరంగంలోన

అబద్ధాల జయభేరి మ్రోగెను

మూడు వంతుల జన సమూహము

ముప్పుతిప్పలు  పడుతున్నరు

ఓటు వేసిన ప్రతి సారి ధరలేమో పెంచుతున్నరు

ఆక్రమణలు పెరిగిపోయేను

అక్రమాలకు అంతులేకపోయెను

నీతినేమో అణగద్రొక్కెను

అవినీతినేమో అందలమెక్కెను

అడ్డదారిలో పోయిన వారు దొడ్డవారిగా ఎదుగుతున్నరు.

# శీతాకోక చిలుక

చిలుకవు గాని చిలుకవు శీతాకోక చిలుకవు

రమ్యము గొలిపె రంగులు పులుముకొన్న

కమనీయ రూపము నీవై అద్భుత అందమైన రూపం నీదే

నీవేమో గోరంత నీ పయనమేమో ఆకాశమంతా

ముట్టుకుంటే వాడిపోయే మృదువైన రెక్కలు నీవే

వయ్యారంగా నీ రెక్కలు ఊగిసలాడుతూ

ప్రకృతిలో రంగులన్ని పులుముకున్న రెక్కలు నీవే

మా కంటి పాపలను మురిపించి మైమరపించి

పురుగు జాతులలలో పుణ్యమూర్తివి నీవై నిలచి

చిన్ని ఆయుషుతో చిత్రాలెన్నో చేసినా

చిలుకవుగాని చిలుకవు శీతాకోక చిలుకవు



# వాన చినుకు

వాన చినుకు లేక నేల తడవకపాయే

నల్లరేగడి భూమి నెర్రలే బారంగా

ఎర్ర చెలక దుక్కి ఎడారి మయమాయే

గొడ్డుగోదాకేమో గడ్డి కరువాయే

పశు సంపదలేక పాలకు కరువొచ్చే

చెట్టు చేమలన్ని బొగ్గు కుంపట్లాయే

ఆనాటి పక్షుల కిలకిలా చప్పుళ్లు అంతరించే పోయే

కొండ గుట్టలు కంకర రాళ్లాయే

చెరువుకుంటలన్ని ఆక్రమణ పాలాయే

నీరు చుక్కలేక బావులెండిపాయే

చమురు, వాయువు కొరకు పొక్కలెన్నో పెట్టి

భూతాపమెక్కువై బతుకు భారమాయే

వంకర పనులతో సంకర జాతి పుట్టే

సంకర జాతిలోన సత్తువ తక్కువాయే

మానవుడి మనుగడ మహా ఇబ్బందాయే

# తెలుగు సంపద

యాభైయారు అక్షరాల తెలుగు సంపద
మా వెలుగు సంపద
కోట్లకొద్ది తెలుగువారి మమకారం
56 అక్షరాల నుడికారం
తెలంగాణ, ఆంధ్రా, రాయలసీమ,
అన్నింట కలబోసిన అక్షరమాల
ప్రతి అక్షరం పలకరిస్తుంటే
పులకరించిపోయే తెలుగు జాతి హృదయం
బదిరులకు బాసటగా నిలచి
అక్షర అక్షర అల్లికనే వర్ణమాలలై వర్ధిల్లెను
ఎల్లలోకమున ఎదిగి ఒదిగి
ఎనలేని కీర్తి నొసంగెను నా తెలుగు
ప్రాచీన భాషగా ప్రాముఖ్యతనొంది
భరతమాత ఒడిలో ఎదిగి ఒదిగినట్టి
ద్రావిడుల మూల కణాల ముద్దుల సరస్వతి
ప్రపంచ నలుమూలల పరుసుకున్న పరువెంతో
56 అక్షరాల తెలుగు సంపద మా వెలుగు సంపద.



# శిల

శిలనై ఉన్న నన్ను శిల్పంగ చెక్కి
జీవముట్టిపడే రూపంబు దిద్ది
భగవంతుడి రూపమిచ్చి భక్తితో కొలచి
మహోన్నత ప్రతిరూపాలకు ప్రణామం గావించి
దేవతా మూర్తుల ప్రణయ గాధలొలికించి
మహోన్నత ప్రతిరూపంగా మలిచి మీరు
మహాత్ముల ప్రతిరూపం మైమరిపించే చిత్రాలెన్నో
అజంతా, ఎల్లోర, హంపీ, రామప్ప, కంచి, ఖజరహో
కోణార్కు, కొలనుపాక, వెయ్యి స్తంభాలు, లేపాక్షి
నటరాజ నాట్యకళ నటన భంగిమల్లో
కనులకు విందు గొలిపే కళాకృతులెన్నో
చారిత్రక ఘట్టాలను స్థిరంగ చిత్రీకరించి
సంగం చెక్కి శిల్పానై సంబ్రమై మెరిశాను.

# ఆకాశవీధి

ఆకాశవీధుల్లో ఉక్కుడేగలపై
విహంగ వీక్షణం వింత వింతలు గొలుపు
పరవళ్లు తొక్కుతూ ప్రవహించే నదులెన్నో
ఎత్తిపోతల్లాంటి జలపాతాలెన్నో
ఆకాశాన్నంటేటి గిరుల శిఖరాలు ఎన్నో
చిరుదివ్వెల్లాంటి ద్వీపాలెన్నెన్నో
కడలిలో కెరటాల పొంగులు ఎన్నెన్నో
చీమల బారుల్లాంటి రహదారులెన్నెన్నో
పచ్చనైనట్టి చిగురుటాకుల మంద
కనులకింపైన కారడవులెన్నెన్నో
కొండా కోనల్లోన కొమ్మా రెమ్మల నడుమ
భానుడి ఉషస్సులు బారులు తీరంగా
అగ్నికీలల నుంచి విరజిమ్మె మిరుగుళ్లు
శ్వేత వర్ణములోన హిమశిఖరాలెన్నెన్నో
మంచు తెరలపైన కదలాడే జీవులు
గుంపు గుంపులుగా అడవి జంతువుల మంద
అంతింత కాదులే భూతల్లి గొప్పంత.



# బతుకమ్మ

పరమాత్ముడందించిన ప్రకృతి వరాలు
తంగెడు పూతంతా పసుపు వర్ణాలతో
గునుగు పూలతోనూ మంచులాగ పరిచి
జిల్లెడు పూలతో గుత్తుల గుంపుతో
మోదుగు పూల గుళ్లల అరుణమయమాయే
గడ్డి పువ్వు తెలుపు పుడమి నక్షత్రాల వనం
తామర పూతంతా జలకాల ఊగిసలే
ముద్దబంతి పూలు మురిపంబు చిందించే
ఎన్నెన్ని పూలతో ఇరగబూసినావు
ఇలలోని సొగసు ఇంతింత కాదాయే
కెంపు, పసుపు పచ్చ, ఆకు పచ్చ
ఎరుపు, గులాబి 7 వర్ణాలు కలబోసిన అమ్మవై
పసుపు కుంకుమతోనూ పూజింపగ నిన్ను
పసుపు ముద్దతోనూ గౌరమ్మనే కొలచి
గంగను దరిచేర గౌరివైనావు
బతుకమ్మ నీవై బాసిల్లినావు
బతుకు దెరువు మాకిచ్చినావు,

# రాబందులు

రాబందులు ఎగిరే చోట - రక్కసులు తిరిగే చోట
నిలువలేను రా నేను జీవించలేను రా
శ్రమకేమో వెనకాడబోము పరుల సొమ్ముకు ఆశపడబోము
తోడేళ్ల వేటలో గొర్రెల మంద
పులుల వేటలో అమాయక జింకలు
మూర్ఖుని యెడల సౌమ్యుడవస్త
అధికారం వేటలో అమాయకుల బలి
ఉక్కుపాదంతో హక్కులనే నలిపి
అన్ని రంగములలో అధముల వత్తిడి
ఉన్నత పదవులను అలంకరించిన
ఆశలకేమో అంతులేక
లంచాల రొచ్చులో మునిగిపోయి
కులము పేర, మతము పేర ప్రలోభాలెన్నో పెట్టి
పదవనే దర్పణము చేత మెరిసిపోయే వారెందరో
సామాన్యుడననే నిజం తెలిసేలోపు
చేవ చచ్చి చావు దగ్గరాయే.



# విసురుతూ

విసురుతూ పనిచేయకు.... కసురుతూ మాట్లాడకు

ధ్యాస, దీక్ష, ఓర్పు, నేర్పు దారి చూపును గమ్యం వైపు

సోంబేరివై తిరగకు సొల్లు మాటలు చెప్పకు

పనిలో మునిగి ఫలితం కోరుకో

ఆలోచన పెంచి ఆచరణ చాటుకో

ఇష్టమైంది ఎంచుకో కష్టమైంది తుంచుకో

మతమునే అభిమతంగా మార్చి

మానవ శాంతికే హితములొలికితే

అంతకన్నా మిన్న అభ్యుదయమేముంది

సంపాదన ఒక్కటే ధ్యేయమా శాంతిలేక జీవనమా

# జననాట్య మాడవే

ఆడవే జననాట్యమాడవే
పాడవే జన పదంపాడవే
పల్లెపల్లెలోన వాడవాడాలోన
కోలాహలంగా కోలాటలాడి
చిడత భజనతో చిందులేస్తూ
గొంతు గొంతు విప్పి పదము పదము పలికి
పరవశంబైనట్టి పల్లె జనుల గానం
నాటి కాకతీయుల మేటి సామ్రాజ్యము
పల్లె పల్లె నుంచి పట్టణము దాక
జనము జనంకై జనహితములొలికి
నాటి రుద్రమాంబ వీరవనితలు గాథ
కష్టసుఖాలన్ని కలబోసి వడబోసి
మంచిచెడులను విడమరిచి బోధించి
వీధి వాకిట్లోన పండు వెన్నెల్లోన
తరతరాలకు తరిగిపోని గాథ
ఓరుగల్లు, నల్లగొండ, గోలుకొండ, బిచ్కుంద,
నలుదిక్కుల నగరాల్లో నగారాలే మ్రోగించి
మన్యంకొండ, కోయిలకొండ, ఎములాడ, దోమకొండ
ఆడాఈడా తేడాలేక కాకతీయుల పాలన గొప్పంత
ఆనోట ఈనోట ఆనాటి పాలనను
ఆడిపాడి వివరించిన గళములు
ఆనంద మయములో ఆనాటి జనం



# మాయంకాని

మరణం లేని మాయం కాని
వేగుచుక్కనై వెలుతురునిచ్చి
పాలపుంతలో ఎదిగి ఒదిగి
వినీలాకాశంలో విహరించనా
విశ్వంలోనా తీరం లేని
ఎల్లలోకంబున ఎదిగిపోనా
సూర్యమండలపు గ్రహాలన్ని
అంతము లేని అనంత లోకానికి
దివ్యలోకంబున దేదీప్యంగ వెలిగిపోయి
భూభ్రమణంలోన పరిభ్రమించి
అమావాస్య చీకట్లోన లోకానికి
వెలుతురునిచ్చే నక్షత్రాన్నై నిలిచిపోనా
మానవుడినై పుట్టినందుకు
జాతికోసం నీతిగ బతికి
సాటి జీవికి తోడుగ నిలచి
మానవాళి మనుగడలోన
ఉడతా భక్తిగా సేవలందించనా.

# బట్టచాటున

చినిగిపోయిన బట్ట చాటున చితికిన బతుకులు

నూలుపోగులు అతికించినా

పిడికెడు మెతుకుల తహతహలు

నాగరికానికి మెరుగులు దిద్దిన నైపుణ్యం మీది

మాసిపోయిన అంగిచాటున చెమట చుక్కల పచ్చిదనం

మొక్క మొక్కకు నీరు నింపే

రైతు కూలీల శ్రమఫలితం

చేసే పనిలో శ్రద్ధ కలిగితే

కష్టమనే పదం కడతేరిపోవును

బడుగు బక్క జీవుల సమిష్టి శ్రమనే అభివృద్ధి

జానెడు పొట్ట గంజినీళ్లకై  అనునిత్యం ఆరాటం

జీవితమంటే వెండితెర కాదని తెలుసుకో

మెరిసిపోవడానికి మనం మురిసిపోవడానికి

నీళ్లులేని ఊరు, కరెంట్ చూడని కళ్ళు కోకొల్లలు

రాజకీయం ఎంతచేసిన అధికారం కొరకే

అధికారం చెలామణిలో పరిపాలన సుభిక్షం కొరకే.



# ఆధునిక దేవాలయాలు

ఆధునిక దేవాలయాలు పనికల్పించే పరిశ్రమలు

శ్రమజీవుడా శ్రమశక్తి యువకుడా

శ్రమకోర్చి పరిశ్రమకోర్చి శ్రమలోన పరిభ్రమించినోడా

ఆకలితో అలమటించి వెట్టిచాకిరిలోన నలిగినోడ

వస్తురూప కర్తవై వరములిచ్చి

ఆచరణ గావించి ఆదర్శంగా నిలచి

మానవుడనే భగవంతుడికి

సమస్త వస్తు జగతినే సృష్టించి

మురికి వాడల్లోన బతుకునీడుస్తూ

అరకొర వేతనంతో బతుకు బండినీడుస్తూ

హారతి కర్పూరంలా శక్తినంతా దారబోసి

వాయు, శబ్ద, దుమ్ము, ధూళి కలుషితం దిగమింగి

సమాజ సేవకై శ్రమ సైనికుడివై

నిరంతర కృషీ వలుడవై రాటుదేలి

యంత్రయుగములో మహాయుగ పురుషుడవై నిలిచినోడా.

# నీతి పలుకులు

నీతి పలుకులు అందరు బోధిస్తారు
జాతిసేవకు కొందరే పాటు పడతారు
రాజకీయాలు అందరు చేయలేరు
మోసాలు కొందరే చేయగలరు
కష్టించి అందరు సంపాదిస్తారు
ఐశ్వర్యవంతులు కొందరే అవుతారు
రంగు రాళ్లు ఎన్నో ఉంటవి
వాటిలో రత్నాలు కొన్ని మాత్రమే
జాతినుద్దేశించి ఎందరో ప్రేరణ గావిస్తారు
వారిలో కొందరే శాశ్వతంగా నిలిచిపోతారు
ఉన్నతమైన ఆలోచనలు అందరిలో ఉన్నా
ఆచరణలో కొందరికే సాధ్యం
కోట్లకొద్ది జన సమూహములో
మానవజాతి పునాదులు కొందరే
విద్యావంతులు ఎందరో ఉన్నా
ఉన్నత శిఖరాలు అధిరోహించేవారు కొందరే.





# వందేమాతరం

వందేమాతరం వందేమాతరం
వందేమాతరం వందేమాతరం
వందే... మాతరం....
త్యాగం! శాంతి! సహనం! త్రివర్ణం
ధర్మం! సత్యం! సహకారం! మానవత్వం
జాతి గర్వించే జయకేతనమే జై హింద్ జై హింద్ ॥వందే॥
భారతీయుడు ప్రణమిల్లెను త్రివర్ణం ముందు
మువ్వన్నెల జెండా మదినిండ మురిపమాయెను
మతము, కులము, ప్రాంతము జాతి సంఘటితము
వీర శౌర్య పరాక్రమము ఒక్కటిగా చేసి
వాయు, నౌక, సైన్య శక్తిని కూడగట్టి
భరతజాతి సేవకై స్వలాభ చింతనమానే ॥వందే॥
వీరులెందరో వీర మణులెందరో
బ్రిటీష్ రక్కసి పాలనపై మూకుమ్మడిగా తిరగబడి
కదముతొక్కి జాతి కొరకై అమరులై నిలిచినారు
ప్రతికళ ప్రతిశ్వాస జైహింద్ నినాదంతో
దిక్కులు పిక్కటిల్లేలా ప్రతిధ్వనించే నలుమూలల ॥వందే॥
హిమాలయ శిఖరాలపై మువ్వన్నెల రెపరెపలు
తరియించెను మా... నయనంబులు
భరతజాతి ప్రతి హృదయం కెరటంలా ఉప్పొంగెను
ఎందరో మహానుభావుల పోరాట ఫలమే త్రివర్ణం. ॥వందే॥

# గుండె తరుక్కుపోతుంది

గుండె తరుక్కుపోతుంది
ఎండిన పైరును చూసి
కంటిలోన నీటి సుడులు తిరిగే
ఎడారైన నేలను చూసి
మోడుబారిన బీడు వారిన
మొలకెత్తని గింజను చూసి
నోటిమాట పలకలేక
తల్లడిల్లెను తనువులెన్నో
వరుణదేవుడు కరుణించి
ధరణి ఒడిలో చినుకు జల్లులు కురుపించినా
మనము నాటిన గింజెనేమో మానుగా ఎదిగి
పరోపరాకం కోరకుండా ఫలితమే చేకూర్చును
చెట్టునీడ సేదదీర్చును పువ్వుపిందె కాయ ఫలము
సర్వజీవులకు భుక్తినిచ్చును
అన్ని తెలిసిన మానవుడవై
పచ్చని చెట్టును పెంచుము
పర్యావరణాన్ని కాపాడుము



# చిన్నజీవులు

సిరులు కురిపించే చిన్ని జీవులు
జాతి ప్రగతికి ద్రవ్యనిధులు
జాతినుద్దరించే కార్మిక కర్షక శ్రమ జీవులు
భూమిలోని ఖనిజాలను పెకిలించి వేరుచేసి
మణి మాణిక్యాలను, వజ్రవైఢూర్యాలను శుద్దిచేసి
సానబట్టి దేశప్రగతికి సోపానమై నిలచి
ఇనుము, ఉక్కు, కంచు, ఇత్తడి, రాగి, రాత్తెండి
వెండి, బంగారము లోహములెన్నో వెలికితీసి
సిమెంట్, సున్నం, బొగ్గు, గనులు, చలవరాతి నిలువలెన్నో నింపి
ఆయిల్, డీజిల్, పెట్రోల్, గ్యాస్ ఇంధనాలెన్నో
పాతాళం నుండి పుడమిపైకి తెచ్చి
క్షార ఆమ్ల సమ్మేళనాలతో
రసాయనాలను రంగరించి ఒడిసిపట్టి
ఔషధ ఉత్పత్తిలో అలసి సొలసి
మురికి వాడల్లోన మసక బారిన బతుకులు
కనీస జీతాలు లేక కష్టాలెన్నో పడుతు
వెట్టిచారికిలోన పుష్టిగా తిండిలేక
తప్పదన్నట్టుగా కార్మికుల తిప్పలెన్నో
అమావాస్య చీకట్లో వెలుతురు నింపే మిణుగురులా
దేశానికి ప్రగతి చేకూర్చే శ్రమ జీవులు.

# అద్దం

అద్దం లేకుంటే ప్రపంచమే ముద్దుగ కనబడదు
దుర్భిణిలోన దాగి ఉన్న ప్రతిబింబం అద్దములే
మంచి తనం ప్రతిబింబాన్ని చూసు కోవాలి లోకములో
సమాజమనే అద్దములో చక్కని రూపం కనిపించును
మాసిపోయిన అద్దం ఎదుట వికారం ఉండును మన రూపం
ప్రతి జీవికి దారి చూపేది కనుపాపద్దములే
మదినిండా సోయగాలు నింపే నయనాలు
ముద్దులొలికేటి మనస్సు కోరేటి
అందాలను బంధించే నేత్రాలయం
జ్ఞానమనే అద్దములో మదినింద దాచుకో జ్ఞాపకాలను
కనుపాప అద్దమును పదిలంగా చూసుకో
విశ్వంలోన వింతకాంతులు వీక్షించుకో
జ్ఞానేంద్రీయ కనుపాపను భద్ర పరుచుకో
మరుపురాని మరిచిపోని అందాలను నెమరువేసుకో.



# త్యాగశీలులారా

త్యాగశీలులారా వందనం
అమర వీరుల్లారా పాదాభివందనం
రాచరిక వ్యవస్థలో రాక్షస పాలనలో
అణచివేత సాక్షిగా అడుగడుగున పోరాటం
బానిసత్వ వెట్టిచేత మగ్గిన మనుషులు
అరాచక వేటలో అబలుల చితికిన బతుకులు
శిస్తులు కట్టలేక నిత్య చావునెదిరించి
శీలం భద్రత కొరకు జానలెంతో తెగించి
నైజమోడి పోకడకు నీరసించి నిరసించి
తెలంగాణ రైతాంగ ఉద్యమం ఎగసిపడే
తిరగబడే యోధులే అగ్నికీలలై నిలిచే
మూకుమ్మడి జనసమూహము అగ్నిజ్వాలలై
ఊరూరా పల్లెపల్లె ఉవ్వెత్తున ఉద్యమాలు
దురహంకార పెత్తనాన్ని దహించివేయగా
భయపడే బతుకు కన్నా చావేమిన్న అని
ఎదురొడ్డి పోరాడిన అమర వీరులారా
త్యాగధనుల్లారా వందనం పాదాభివందనం.

# భగవంతుడి సేవలో

భగవంతుడి సేవలో పల్లకి మోసేది కొందరే

జన, జీవ ఉద్ధరణకు పరిశ్రమించే శ్రమ జీవులు కొన్నే

మంచిచెడుల మిశ్రమమే భూలోకం

స్వచ్ఛత నిశ్చలం నిరాడంబరం సాత్విక గుణంకు ప్రతీక

పరులకోసం ప్రాకులాడి పరిత్యజించి

ప్రాణికోటికి హాని తలచనివాడే దైవగుణంకు సాటి

చెంచలం డాంబికం క్రూరత్వం

మిడిసిపాటు, మనస్సులోటు రాక్షస గుణంకు తీసిపోరు.



# కోయిల

ఓ కోయిల నీకూతలే వినిపించగా

వసంత కాలం వచ్చిందని అనిపించే నీ గానం

లోకానికి తెలియజేయవే

అడవి అడవి అంతా తిరుగుతూ

చెట్టుకొమ్మలు అన్ని ఎగురుతూ

పక్షి పక్షినీ పలకరిస్తూ

పుప్పొడి పూతను సప్పరిస్తూ

లేతలేత చిగురుటాకుల

చివరలన్ని రుచులు జూస్తూ

తియ్యనైన నీ గొంతులోంచి

మధురమైన ఆ వసంతగానం వినిపించగా

చెవులకింపైన నీగానాన్ని ఏమని కొనియాడినా

నీకూతకు సాటిరావులే

నీ దేహమేమో పిడికెడంత

నీ గానమేమో కొండకోనలంతా

కొమ్మచాటున యాడ ఉంటవో

కంటిపాపకు కానరావులే

నీ రూపమేమో నల్లనమ్మ

నీ పాటనేమో వేణువమ్మ.

# కాకతీయ

కాకతీయ మిషన్ పేరు కదము తొక్కుతున్నది
ఊరూరా ప్రగతి రథం ఉరుకులు పెడుతున్నది
మిషన్ కాకతీయ మెరుగులు దిద్దుకుంటుంది
మరపురాని విధంగా మరిచిపోని విధంగ
అన్నదాతకు అండగా సర్కారే నిలవగా
తెలంగాణ జనమంతా జాతరగా సాగగా
చెరువులోన పూడికను సేంద్రీయ ఎరువుగ వాడి
సాగుబడి భూమిలోన ఎరువుగాను ఎగజల్లి
కరువును పాతరేసి చెరువులోన నీరు నింపి
చినుకు చినుకు ఒడిసిబట్టి
జలసంపద ప్రోగు చేసి
భూతల్లి ఒళ్లంత పంట సిరులొలకగా
ఇంటింట్లో ధాన్యలక్ష్మీ సిరిసంపద నిండగా
మిషన్ కాకతీయంటే తెలంగాణ రాష్ట్రం
దేశమంతా గొప్పగా ఆదర్శంగా పొగడగా.



# హేళన

ఎదుటివారిని చూసి హేళనగా నవ్వకు
హీనమగును నీ బతుకు ఏదో ఓ రోజు
ధనము ఉందనుకొని మానవ ధనమనే చులకన చేసి
వయస్సు ఉందనుకొని కండ బలము చూసి
మురిసినా నీవు మురికి పాలవుదువు
కంఠముపై భాగముతో కవ్వింపు చేసినా
మనుసులో నీకు మలినమే నిండెనే
వెర్రిచేష్టతో నీవు విలువలనే మరిచినా
అంత్యకాలములోన వికారమౌదువు
పైపైన నటనతో ప్రాకులాడిన గాని
నిజము తెలిసేలోపు శ్వాస వదిలెదవు.

# కలం

హలమనే కలముచేత నీరనే సిరాతో
కాగితాల పుటలనే మడులుగా మలిచి
పుస్తకాన్ని పంటభూమిగా చేసి
కలమునుండి జాలువారిన అక్షర విత్తనమై
మొలకెత్తిన సాహిత్య పైరునే పెంచి
జ్ఞాన శిరా రాసుల ధాన్యమే పండించి
తరతరాలు గడిచినా తరగిపోకుండా
గ్రంథాలయమనే గుమ్మలలో
జ్ఞాన సిరా రాసుల పద సంపద నింపి
పలు రకాల భాషలతో మానవున్ని తెలివిపరిచి
ప్రపంచ నలు దిక్కుల సమాచారం సేకరించి
విజ్ఞాన అక్షర రాసులను భద్రపరిచి
పూర్వకాల ఘటనలను చరిత్ర పుటలుగా నింపేసి
కలం ప్రతి ఒక్కరికి చేదోడుగా మెలుగుతూ
మనుస్సులోని భావాలను అక్షర సత్యంగా చూపుతూ
కాలం అంతరించిన సజీవ సాక్షిగా నిలచి
రాబోయే కాలానికి వారధిగా నిలిచేదే కలం.





# సర్కార్ ఉద్యోగుల్లారా

సర్కారు ఉద్యోగుల్లారా సంస్కార వంతుల్లారా
సమస్తం మీరేనని నమస్తే చేస్తున్నాం
అధికారివి నీవని అండగా మీరుంటారని
గుప్పెడంత శ్వాసతో గంపెడంత ఆశతో
ప్రజా స్వామ్య వ్యవస్థకు ప్రాణం మీరేనని
సామాన్య మానవుని సమస్య పరిష్కారానికి
కాళ్లుచెప్పులు అరిగేలా కార్యాలయాలకు తిరుగుతే
పైసల వేటలో, పైరవి పేరిట కార్యశుద్ధి లోపంచి
మానవత్వం మరిచి, హక్కును హరించి, హీనంగా మారకు
ప్రభుత్వమిచ్చే వేతనం ప్రజలదని మరువకు
అవినీతికి పాలుపడక ప్రజా సేవకై నిలువు
బతకాలని ఆశ ఉంటే అది తప్పుకాదు
అవినీతితో అందలమెక్కాలంటే అది ఒప్పుకాదు
అడ్డదారిలో ప్రతి పైసా అవమానం చేకూర్చును
నీతిగా బతికితే లోకములో జాతి వెలుగువై నిలిచెదరు.

# సూర్యుడు

సకల జీవుల మనుగడకు సర్వం సూర్యుడే

గాలికి ఏ కులం, శ్వాసకు ఏ మతం

నీరుకు ఏ కులం నీతికి ఏ మతం

స్వచ్ఛత జీవితాన్ని మచ్చలేక నిలుపును

మలినమే విషంగ మరణానికి నాంది అగును

సంకల్పమనే మర్రిగింజ ఊడలుగా అల్లుకుని

ప్రగతికి సోపానమై పచ్చని నీడనిచ్చు

ఆవగింజంతా అవినీతి ఆలోచన

పుట్లకొద్ది పుట్టుకొచ్చే పల్లేరు కాయ పొదల్లా

బాటసారుల పాదాలకు గుచ్చుకుని భాదించును

ఏమతం ధర్మమైనా ఏ మని బోధించును

ఆపదలో ఉన్న జీవిని ఆదుకొమ్మని

యుగయుగాలలో జగడాలెన్ని జరిగినా

మహా ఉద్దండులెందరో నేలకొరిగిపోయినా

చేసిన మంచిపనే స్థిరంగా నిలిచిపోయే

కనిపించే సూర్యచంద్రులే లోకానికి సాక్షంగా

చీకటి పారద్రోలి వెలుతురునే నింపెను.



# నల్లగొండ

నల్లగొండరా నీలగిరిరా పిల్లలమర్రి పినవీర భద్రుడు

పుట్టినిల్లురా నల్లగొండ

రాచకొండ, గాజుల బండ, వేములకొండ, నందికొండ,

ఫణిగిరి, భువనగిరి, పానగల్లు, సుంకిశాల, రేచెర్ల

మట్టపల్లి, వాడపల్లి, పిల్లలమర్రి, ఏలేశ్వరం

రాటుదేలిన రాజ్యాలెన్నో చెక్కు చెదరని చరిత్రలెన్నో

జ్వాలా నరసింహా, యోగా నరసింహా, గండబేరుండ నరసింహ,

ఉగ్ర నరసింహా, లక్ష్మీ నరసింహా పంచరూపాల నరసింహా

మా యాదగిరి లక్ష్మీనరసింహా

వినోభావే భూదానం చేసిన పోచంపల్లి

నాగార్జునుడు ధ్యానం చేసిన నందికొండ

దేవరకొండ, వలిగొండ, నల్లగొండ,

ఉగ్గుపాలతో ఉద్యమాలకు ఊపిరిపోసిన నల్లగొండరా

రజాకార్లను తరిమికొట్టిన పోరాటాల ఖిల్లరా.

# స్వర్గాలు

ప్రకృతి వడిలో పచ్చనైన వన సంపద
చల్లగాలి ఊగిసలో ఒలకబోసే వోయలెన్నో
నునువెచ్చని గ్రీష్మంతో హిమమెంతో విచ్చుకొని
జలజల పారేటి జలపాతాల సవ్వడులే
యమునా, గంగోత్రి, నర్మదా నదులెన్నో
కృష్ణా, గోదావరి, మంజీరా, కిన్నెరసాని
భరతమాత ఒడిలో ఓలలాడే సొగసులెన్నో
మురిపించే మైమరపించే ప్రకృతి వరాలెన్నో
అమరనాథ్, భద్రినాథ్, ఋషికేష్, కేదారీనాథ్
అనుబూతిని కలిగించే హిమ శిఖరాలెన్నో
సింమ్లా, కాశ్మీర్, మనాలి, డార్జిలింగ్
భూతల స్వర్గాలై విలసిల్లె చిత్రమాలికలై
తంజావూరు, మదురై, లేపాక్షి నగరాలు
చోళపాండ్యుల భక్తికి ప్రతీకలై నిలచి
అరుదైన పుణ్యక్షేత్రాలు, మరపురాని అనుభూతులు
చార్మినార్, రాజ్‌కోట్, తాజ్‌మహల్ కట్టడాలు
భరతజాతి కిరీటంలో కెంపులై మెరిసేను.



# రైతన్న

చినుకు చినుకు లోన చిత్తడి నేలలో
చిమ్మచీకట్లోన ఓయన్న తప్పటడుగులాయనే మాయన్న
పొలముగట్టు చేర పురుగు బూసిని దాటి
ఈదురు గాలుల్లోన దుక్కి దున్నంగా
వానతుంపర్లకు ఒళ్లంత తడువంగా
సలిగాలిలోన వనుకుడే పుట్టి
సర్దిజరముతోటి సొమ్మసిల్లిన గాని
సర్కారే నిన్ను పట్టించుకోదాయే
నీకోసమేనని పాట్లేమో పడితివి
పరుల ఆకలితీర్చి అన్నదాతవై
అప్పుల పాలై అలమటిస్తున్నావు
కష్టాలెన్నొచ్చినగాని కన్నీళ్లెన్ని రాల్చినగాని
జాతిగుండెవై నీవు నిలచి జవసత్వాలు ధారపోసి
పంటనే పండించి అమ్మబోతే అరువాయే ఓయన్న
కొనబోతే కొరివాయే మాయన్న.

# తెలంగాణ

దశాబ్దాలు ఏలిన.... శతాబ్దాలు ఏలినా....
ఏండ్లకేండ్లు గడిచినా.... ఎందరో రాజులు ఏలినా...
తరతరాల చరితగల తల్లి నీకు వందనం
తెలంగాణ తల్లి నీకు వందనం
బుద్ధుడి కాలంలో కోసల వాసి
బావరి ఇక్కడే నివసించాడని
ఒకనాడు నీలోన రాజ్యాలు ఎన్నెన్నో
కదంపూర్ (కరీంనగర్), పౌదన్యపురం (బోధన్),
పిదుండ ముషిక, ధూలికట్ట, బొంకూరు, ఫణిగిరి,
కొండాపురం, కోటి లింగాల, గాజులబండల
ఎన్నెన్నో రాజ్యాలు విలసిల్లెనే
అశోకుని శిలాశాసనలా మౌర్యుల సామ్రాజ్యం
శాతవాహనులేలినట్టి ధరణి కోట
ఇక్ష్వాకులు పాలించిన విజయపురి
విష్ణుకుండినుల ఇంద్రపాల పోరుగడ్డ
బాదామి, చాళుక్యుల ఆలంపుర్ ఆలయాలు
నల్లగొండ పులకేసి ఏలేశ్వర శాసనం
రాష్ట్రకూటముల కీర్తివర్మ పాలన
దంతిదుర్గుని తెలంగాణ పాలన
వేములవాడ చాళుక్యుల కొరివి శాసనమై
ముదిగొండ చాళుక్యులు కందుకూరి చోళులు
మగతల, భోన్‌గిరి, వాడపల్లి, కొలనుపాక
నల్లగొండ, అనుమకొండ, పొలవాస
కల్యాణ చాళుక్యులు కలబోసి ఏలినట్టి
కాకతీయ కరవాలం, రుద్రమాంబ ఓరుగల్లు
భవభూతి, రన్నడు, గోనబుద్ధారెడ్డి, కుప్పాంబిక
కవులెందరో రాణించిరి
రేచెర్ల సింగమనాయకుడు, ముసునూరి పాలకులు
తరతరాలు తల్లి నిను పాలించే
బహుమని సుల్తాను, కుతుబ్‌షాహీలు, అసఫ్‌జహీలు,
నైజాం నవాబు వలస పాలనలో
అణచివేతతో నీ బిడ్డల వెతలెన్నో
రాజులు మారినా రాజ్యాలు కూలినా
నిరంకుశ పాలనకు పోరాటం సలుపగా
తరతరాలు మారినా నెత్తురు చిందించి
పరాయిపీడన వీడి స్వరాజ్యము సాధించగా
విశ్వమంతా నీపేరు మారుమ్రోగె తెలంగాణ.

# చినుకమ్మ

చినుకమ్మ చినుకమ్మ చినుకమ్మ
వానచినుకువై కురవమ్మ
మేఘాల గుంపుతో లోకాన్ని కమ్మేసి
ఆకాశమునుంచి జలజల రాలుతూ
చెట్టుకొమ్మ ఆకు, పువ్వు పిందె ఫలమును ముద్దాడి నీవు
ప్రాణదాతవై చినుకమ్మ ధాత్రిపై నువ్వు చేరు చినుకమ్మ
నీరాక కొరకై ఎదురు చూపులు చూస్తూ
నిరాశ నిస్పృహ నిట్టూర్పు జీవనం
కొండల్లో గుట్టల్లో పరవళ్లు తొక్కుతూ
వర్రెల్లో ఒంకల్లో పరుగులెత్తంగ
వరుదలన్ని కలిసి వాగులై పొంగంగ
వాగులన్ని పొంగి చెరువులు నిండంగ
ఏరులన్ని కలిసి నదులై జీవ నదులై పారంగ
బతుకు దెరువులోన బాసట నిలచి
ఎనలేని సంపద మాకందించి
పాపకర్మలను ప్రక్షాళన గావించి
పరమాత్ముని దరిచేర పరిశుద్ధిగావించి
ఎల్లకాలం మాకు తోడుండాలమ్మ.



# చెరువమ్మ

చెరువమ్మ... చెరువమ్మ... చెరువమ్మ
నీవేమా ఆదెరువమ్మ... నీవే మా చేరువమ్మ
ఊరూర చెరువు, పల్లె పల్లె చెరువు  ప్రాణికోటికి ఆ దెరువు
సలక ప్రాణికోటికి ఆదెరువునీవమ్మ
నీలోన నీటి చుక్కలేక మా కన్నీటి చుక్కే గుండె చెరువాయే
జీవజాతులకు బతకు భారమాయే
చినుకు చినుకు కలిసి నిను దరచేరంగా
నీవు నీటితో కలకలలాడంగ
భూతల్లి ఒళ్లంత పచ్చదనమాయే
నీవు నిండుగుంటే పంటలే పండంగ
మా కడుపు నిండంగ మా బతుకు సాగంగ
జలజీవరాసుల సంపదే పెరుగంగ
పశుపక్షాదులు జంతు జాలము
పురుగుబూసి నిను దరిచేరంగ
జీవకోటి రాసుల దాహమే తీర్చంగ
జలజీవరాసులకు నీవే నివాసము
వలస పక్షులకు నీవే విడిదివి
కిలకిల కూతలతో కళకళలాడంగ
బతుకమ్మ గౌరియే గంగనే దరిచేరే
గాలితాకిడితో అలల అందాలెన్నో
అలల ఊగిసలోన ప్రకృతి సవ్వడై
మనుసునలరించి మాకు బతుకు నిచ్చే.

# మన తెలంగాణ

మన తెలంగాణ నవ తెలంగాణ
జై తెలంగాణ నమస్తే తెలంగాణ
అక్షర అక్షరం కలిపి అల్లికజేసి
తెలంగాణ పక్షాన వారధిగా నిలిచి
ప్రజల పక్షాన జాతి వెలుగుగా నిలిచి
నిత్య ఆరాటంతో అక్షర పోరాటంతో
నీతి న్యాయంతో ధర్మ రక్షణకై
అక్షరాలను కలబోసి అచ్చువేసెను వార్త
వీరత్వ పటిమతో త్యాగాల కీర్తితో
ఊరూర కదలిక ఉప్పెనై ఎగసిపడి
కోట్ల గొంతుల కోరికల మేర
రాష్ట్ర సాధనకొరకు కదిలింది కలము
తెలంగాణ నడిబొడ్డు గోలుకొండపై
మువ్వన్నెల జెండా రెపరెపలాడగా
తెలంగాణ ప్రజల గుండె సంబరమాయే
స్వేచ్ఛావాయువులు పీల్చేను ఎదనిండ.



# యోగివా

యోగివా, భోగివా, లేక రోగివా
పరిమితైన ఆహార శ్రమించే తత్వం
సాత్విక ఆహారంతో సద్గుణ లక్ష్యంతో
యోగిగా, ఆరోగ్య భోగివై ఆనందమెంచుకో
అధిక ఆహారం ఆరగించి
నాలుక రుచికోరి నానా గడ్డి కరిచి
పోటీమీద పోటీ పడి శరీర చెత్తను పెంచి
భోగ విలాసాలతో ఆలోచన శూన్యంతో
విలువలను విస్మరించి సహసించి పనిచేయక
బీడి చుట్ట కంపుతో గుట్కా తంబాకుతో
తిండి తిప్పలు వదిలి తాగుడుకు బానిసై
రోగాల నొప్పులతో దేహాన్ని నుజ్జు చేసి
నరక యాతనతో నాన ఇబ్బంది పడుతూ
రోగివై ఆసుపత్రి పాలై ఆర్తనాధాలే చేస్తూ
బతుకే ఆ బతుకు వీడి నిజం తెలుసుకో
పరిమితంగా భుజించి నీవు యోగివై నిలిచిపో.

# భూమి

భూమి ఒక్కటే జీవులు అనంతం

తల్లిఒక్కటే పుట్టుకలు వేరువేరు

మనుషులు ఒక్కటే ఆలోచనలు పలు రకాలు

ఎంతో ఎత్తు ఎదిగినా ఇంకేదో చేయాలని

చేసేది కొంతనైతే ఆకాశామంతా ఎదగాలని

తనగొప్పని చాటడానికి మరి కొందరు శ్రమిస్తూ

పరువనే పల్లకిలో ఊరేగాలనే కోరికతో

పల్లకిని మోయడానికి సహజీవిని బలిచేస్తూ



# కార్మికులు

కార్మికులే కన్నీరు పెడుతుండ్రో కనిపించని వెతల
జాతి ప్రగతికి యంత్ర సారథై చాలీచాలనీ వేతనాలతో
చితికిన బతుకుల వెతలు ఎన్నెన్నో నా దేశములోన
నిరుద్యోగుల వలస బాటలో పల్లెపల్లె లే తరిగిపోయెనే
జానెడు పొట్టనిండటానికి బండ చాకిరికి బానిసాయేను ॥కా॥
పాలకులెందరో మారిన గాని నా దేశములోన
చట్టాలెన్నో మార్చిన గాని నా రాజ్యములోన
చాలీచాలనీ వేతనాలతో సమస్యలేమో వెక్కిరించెను
బక్కపలచని బతుకులలోన బాధల కుంపటి రాజుకుంది ॥కా॥
సదువుల తల్లి సరస్వతమ్మ, లచ్చిముంటేనే వస్తనన్నది
సుట్టపోని చూసినగాని సట్టినేమో కదలనన్నది
నొప్పిరోగం వచ్చిన గాని వేతనమే కోత ఆయెను
గుత్తేదారు నౌకరిలోన నా దేశంలోన
నత్తనడకగా బతుకు సాగెనయ్యే నా రాజ్యములోన
లోసులుగు కలిగిన చట్టాలు హక్కులనే హరించివేసెను
భీమా ధీమా కొరవడెనయ్యో శ్రమజీవులకేమో ॥కా॥
మురికివాడల బతుకులతో మూలుగుతున్న జనజీవనం
పల్లెల నుంచి వలస వచ్చిన పీడిత తాడిత జన సమూహం
అంచెలంచెలుగా పెరిగిపోయెనయ్యో నగరాల్లోన
పలచబారిన బతుకులాయ్యెనయ్యో నా పల్లెల్లోన. ॥కా॥

# తల్లిగోదారి

తల్లి గోదారి నిన్ను తాకగానే
తనువెంతో పులకరించనే
మనసేమో పరవశించెనే
గలగలా గోదారి గమ్యం చేరేదాక
మరువలేని గాథలతో మలుపులెన్నో తిరుగుతూ
యదలోన మదినిండ తనలోన దాచుకుని
కొండా కోనలు దాటి లోయల్లో పారుతూ
తల్లి నీ తీరానా ఎన్నో సొగసులు ॥తల్లి॥
రామప్ప శిల్పంలో జీవమే ఉట్టిపడి
ఊరూరా పల్లెపల్లె నేలనే తడుపంగ
పచ్చనైన పైరు పురుడు పోసుకొని
ధాన్య సిరి రాశుల సృష్టికి మూలం నీవై
దక్షణాది గంగవై అలల సవ్వడిలో
అందాలెన్నో ఒలకబోసే జలపాతమై ॥తల్లి॥



బాసరలో ఆసరగా మమ్ముజేరి
సరస్వతి కటాక్షముతో మోక్షమే మాకిచ్చి
పోచంపాడులో పొంగిపొర్లుకుంటూ
కోటి లింగాన్ని చుట్టేసి
ధర్మపురి లక్ష్మీ నరసింహుడిని దరిచేరి
కాళేశ్వరంలో ఈశున్నే కలిసి
భద్రాది రామయ్య పుణ్యస్నానాలాడగా
గౌతమి నదియే గోదారై పారగా ॥తల్లి॥
సిరులొలికే మాగాణి
సింగరేణి గని సంపద
తెలంగాణ ధరణిపై ఉరుకుతున్న జలమెంతో
జలజలా ఎగిరేటి జలసంపద నీలో ఎంతో
మంజీరా, కడెంనది, మానేరు, పెదవాగు,
వార్ధా, పెనుగంగా, ప్రాణహిత, ఇంద్రావతి
లక్కవరం, కిన్నెరసాని, శబరీ నదులెన్నెన్నో
అన్నింటిని కలుపుకుని అమ్మవు నీవై
పాపికొండల నడుమ ప్రవహించు గోదారమ్మవై. ॥తల్లి॥

# వలస

వలస బతుకుల జాతరలోన ఒరిగిందేముంది

మనకు జరిగిందేముంది

భుక్తికోసము వలస బాటలో అలసిన బతుకులు

వలస బతుకుల కన్నీళ్లేమో ఇంకి సుడులు తిరిగే

కనురెప్ప సైగల ఓదార్పేమో కడుపు నింపదాయే

కూలీనాలీ బతుకులలోన దేవులాట లెక్కువాయే

బండెడు చాకిరి చేసిన గాని బతుకు సాగదాయే

మనకు మెతుకు కరువాయే

కష్టాన్ని నమ్ముకుంటే తప్పులేదురయ్యా

నీతిగా ఉంటే మనని జాతి మెచ్చురయ్యా

జాతి కొరకు నిలచిన కీర్తిమంతుడవు

భగవత్‌గీత, బైబిల్, ఖురాన్ బోధనలలో

సాటి మనిషికి సహాయ పడితే బతుకు ధన్యమయ్యో.



# అమ్మని మరువకురా

అమ్మని వమ్ము చేసి ఆడకు
అమ్మే ప్రాణం పోసిందని మరువకు
రెక్కలొచ్చి ఎగిరినా వేరే గూడు కట్టుకున్నా
అమ్మని మరువకురా ఆదరణ చూపరా
నిలువెత్తు నీ రూపమే అమ్మ గొప్పదనమురా
తన ఆకలి తీరకున్న మన ఆకలి తీర్చేను
అనునిత్యం రక్షణగా అమ్మ నిన్ను కాపాడిన
ఆరోజులను మరిచిపోకుమా
అమ్మపంచిన ప్రేమకు ఆనవాళ్లు నీవేరా
అమ్మ చేసిన సేవకు వెల కట్టగలవా
అమ్మ ప్రతిబింబమే మన రూపమని మరువకు
మన కడుపున పుట్టిన పిల్లలంటే ఎంత ప్రేమో
మనమంటే మన తల్లికి అంతే ప్రేమని తెలుసుకో
చులకనగా మాటలాడి అమ్మను అవమానించకు
బ్రతికున్నన్నాళ్లు చూపని ప్రేమ
పోయినంక రోదిస్తే తిరిగి వచ్చునా మన అమ్మ
ఎంత ఎత్తుకు ఎదిగినా మనమెంత ఎత్తుకెగిరినా
అమ్మ దీవెనలే సౌభాగ్యము ఇచ్చును.

# ఫ్యాక్షనిజం

మానవత్వం చూపని ఫ్యాక్షనిజం

ఆలోచన లేని టెర్రరిజం

సాటి మనిషిని చూడని ఉగ్రవాదం

ఎవరిని ఉద్ధరించేది ఈ నిజం

మృత్యుఘోషతో విలవిలలాడిన

ఎన్నో జీవుల ఆర్తనాదాలు వినిన

కనికరం లేని కసాయి

మృగాన్ని మించిన దుష్టుడు

ఉగ్రవాదం విడువు మమతాను రాగాలు పంచు

శాంతి భావం పెంచు స్నేహ భావం పంచు

పగ ప్రతీకకు స్వస్తి పలుకు

ప్రగతి పథంకు పదును పెట్టు.



# ఆర్యులు

ఆర్యులు, మౌర్యులు, చాళుక్యులు, చోళులు

ఏలినట్టి ఈ గడ్డ పాలించిన రాజ్యాలు

హైందవులు, శైవులు, జైనులు, బౌద్ధులు

చెక్కినట్టి శాసనాలు విరాజిల్లే శిల్పాలు

కళకళలాడినట్టి అలనాటి సంస్కృతి

గర్వించదగినట్టి శతాబ్దాల పాలన

సాహిత్యం సంస్కృతి వెల్లువిరిసె జీవనం

శైర్యం ఉట్టిపడే రాజుల లక్షణం

గోన బుద్ధారెడ్డి, కుప్పాంబిక, దాశరథి, వట్టికోట,

కాళోజి, కవిసార్వభౌములని కన్నది నా గడ్డ.

ఈ గడ్డపై నా జన్మ ఎంతో భాగ్యం

పూర్వజన్మ సుకృతమే ఈ జన్మ ధన్యం.

# భేదాలు

మాకు లేని భేదాలు మీకు ఎందుకు
నోరులేని పక్షిని పేరులేని పక్షిని
ఆహారం కొరకై ఆకాశంలో విహరిస్తూ
దేశ దేశాలను పయనిస్తూ
ఖండ ఖండాలను దాటుతూ
అలసి సొలసిన ప్రయాణంలో ఆకలితో అలమటిస్తూ
సముద్రాలను దాటుతూ విశ్వమంతా చుట్టి వచ్చినా ॥మా॥
ప్రాంతీయ వాదం అంటారు
జాతి వాదం అంటారు
మత వాదం అంటారు
కుల వాదం అంటారు
అన్ని జన్మలకన్నా ఉత్తమ జన్మ మీది
జ్ఞాన సంపన్నులు మీరు
విజ్ఞాన సంపన్నులు మీరు ॥మా॥
నోరు ఉన్న వారుమీరు
పేరు ఉన్న మీరు
ఆశించే వారు మీరు ఆశపడే వారు మీరు
ఏపూటకాపూట వెతుకులాడే జీవులం
ధాన్యాగారాలు లేవు మాకు
మారక ధనము లేదు మాకు. ॥మా॥



# ఎలా మరువను

ఎలా మరువను మిమ్మెలా మరువను
ఆకలితో అల్లాడుతుంటే అన్నమే పెట్టి
దిగులుతో బతుకుతుంటే దగ్గరకు చేర్చుకుని
ఆపదలో అండగా నేనున్నానని వెన్నుతట్టి
అడగకుండానే అందలం చేర్చిన మిమ్ము ॥ఎలా॥
తల్లిలాంటి శిక్షణ నిచ్చి... తండ్రి లాంటి రక్షణ ఇచ్చి
ఆలనా పాలన అన్ని చూసిన మిమ్ము
తల్లిగాని తల్లివై.. తండ్రిగాని తండ్రివై
చదువుగాని చదువునిచ్చి మెరుగైన శిక్షణనిచ్చి
అందరిలో మిన్నగా బతుకు దెరువు చూపిన మిమ్ము ॥ఎలా॥
కళ్లు మూసినా మీరే కళ్లు తెరచినా మీరే
కనకున్నా కన్నవారై కనుల ముందే ఉన్నారు
నాలో ఉన్న ప్రేమను ఎలా పంచను
నాలో ఉన్న భావం ఎలా తెలపను.

# వృద్ధ వయస్సు

వృద్ధ వయస్సులో జీవనం దుర్భలమైన పయనం

ఆదరించే నాధుడు లేక అల్లాడే జనం

కన్నవారినే కనికరించని వేళ

మమతాను రాగాలకు దూరమైన వేళ

కాళ్లు ఆడని వేళ కడుపు నిండని వేళ

భాదను భరించి గుండె బండగా చేసుకుని

నలుగురితో చెప్పుకుంటే నవ్వుల పాలవుతామని

అమావాస్య చంద్రుడిలా జీవన పయనం చేస్తూ

బతుకు భ్రమణంలో సంధ్యా సమయం సమీపించెనని

ఎంతో కుమిలిన బాద వృద్ధులకే ఎరుక.



# భుక్తి

జీవన భుక్తికోసం వెదుకులాటలో
జనం కదులుతోంది పల్లె జనం కదులుతోంది
పల్లెలన్ని నిదరోయి పట్టణాలు ఎగసిపడే
వలసతో ఊళ్లకు ఊళ్లన్ని బిక్కమొఖం వేసుకొనె ॥జీవన ॥
కళకళలాడిన వీధులే కళాహీనమైపోయే
బిక్కు బిక్కుమంటున్న బక్కజీవుల బతుకులు
భుక్తిపాడి పంటలకు స్వస్తి పలికి
వాణిజ్య పంటలపై వ్యామోహం పెంచుకుని ॥జీవన ॥
నవీన పద్దతంటూ నాణ్యమైన తిండిలేక
క్షణకాల సుఖం కొరకు వ్యసనాలే నేర్చుకుని
తాళి బంధాన్ని ఎగతాళి చేసేసి
వికృతమైన చేష్టలతో ప్రకృతిని మార్చేసి ॥జీవన ॥
భావితరాల భవిష్యత్‌ను మరిచిపోయి
చెట్టుచేమలను నేలమట్టము చేసి
అభివృద్ధి పేరిట భూతాపానికి కారణమై
సృష్టిలోని సంపద గొప్పదనం మరిచి. ॥జీవన ॥

# నిజాం

నిజాం నిరంకుశం రజాకార్ల అకృత్యం
విముక్తి పోరాటానికై వేలాది ప్రాణ త్యాగాలు
స్వేచ్ఛా జీవనం కొరకై దాస్య శృంఖలాలు తెంచుకుని
వీరోచిత పోరాటం చారిత్రక ఘట్టమై
మూడు శతాబ్దాల కబంద హస్తల విముక్తి కొరకై
తెలంగాణ జన జీవన బతుకు దెరువు పోరాటం
స్వేచ్ఛా జీవనం కొరకు వెట్టి చారిని నెట్టివేసి
దొరతనాన్ని కొల్లగొట్టి సాయుధ పోరాటమెంచి
గ్రామ గ్రామాన తిరుగుబాటు బాహుట ఎగురేసి
స్వాతంత్ర్య భారతావని సైనిక బలగాలతో
ఉస్మాన్ అలీఖాన్ తలవంచి
కసాయి కాశీం రజ్వీని పారద్రోలి
స్వతంత్ర భారతావనిలో విలీనం జరిగే.



# ఆత్మ

ఆత్మను నేనై పరమాత్మవు వీవై
ఆటలేమో ఆడేద్దామా ఈ పృథ్విపై
మనిషిలోన ఉన్నది ఆత్మ
మనస్సులోన ఉన్నది పరమాత్మా
మనిషిలోని "షి" విడదీస్తే "మని" ఉండును
మని ఉన్నంత కాలం చలనం ఉండును
మనిషిలోంచి మని వెళితే షీ మిగులును
"షీ" అంటే పనికి రానిది (పార్థీవం)
ప్రతి ప్రాణిలోని ఆత్మ పరమాత్మలోన కలుసును లే
పుట్టడం చావడం నిజం పాపం పుణ్యం నిజం
మనిషి ఉన్నంత వరకు నాటకం
మనుసు ఉన్నంత వరకు సంబరం
గాలి పటానికి దారమే ఆధారం
జీవముంటే ప్రతి జీవికి ఆత్మే ఆధారం
సృష్టిలోన ఎన్నో ఆత్మలున్నా పరమాత్మ మాత్రం ఒక్కడే
సృష్టిలోన ఎన్నో పదార్థాలు ఉన్నా ఆకలి తీర్చడానికే.

# కులం

కులం కులమని కుంచితాలు పెంచుకోకు
మతం మతం అని మాత్సర్యం పెంచుకోకు
కులం కన్న మిన్న గుణం రా
గుణము కలిగిన వాడే ఘనుడు రా
నాది నాది అనేది ఏది నీదిరా
ఎవడి బతుకు దెరువు వాడిదేను
కులంపేర కోట్లు గడించిన
మతము పేర వైష్యమ్యాలే సృష్టించినా
మారణ హోమానికి బీజం వేయకురా
మమతాను రాగాలు పంచుము రా
సమతా భావం కలిగి ఉండుమురా
చదువు సంస్కారముతో ఎదిగిన నీవు
కులము ఏలరా నీకు మతము ఏలరా
ఒకే మొక్క కొమ్మలం, ఒకే కొమ్మ రెమ్మలం
ఒకే రెమ్మ పువ్వులం, ఒకే పువ్వు ఫలములం



# నాలుక

నా నాలుక తేనె పలుకులొలకగా
నాభాష మృదువులొలకగా
కత్తికన్నా పదునైనది నాలుక
సుతిమెత్తని మాటలొలికె నాలుక
కత్తి శరీరాన్ని ఖండించును
కఠినమైన మాట మనస్సును ఖండించును
మాట మంచిదైతే మనస్సును కరిగించును
మారణాయుధాలతో సాధించనిది
మాటల కోటలతో సాధించవచ్చు
సున్నితమైన నీటి బిందువు
పాషాణాన్ని కరిగించును
మృదువైన భాష కఠినాన్ని చేధించును
సరళత్వముతో దేనినైనా సాధించవచ్చును
శతృవుని మిత్రునిగా చేసుకోవచ్చు
ఎత్తిపొడుపు మాటలు మాని
ఎల్లవారి సుఖము కోరు నాలుక.

# చిన్ననాటి

చిన్ననాటి చిలిపితో చిత్రమైన చేష్టలతో
చెరువులో ఈదులాడిన చిన్ననాటి సంబరం
మళ్లీ వచ్చునా మళ్లీ వచ్చునా
బడికి ఎగనామం బెట్టి అబద్దాల మాటలు చెప్పి
ఇసుక దిబ్బలపైన పిల్లగంతులే వేసి
తోటలోన కోతి కొమ్మచ్చాడిన చిన్ననాటి సంబరం
మళ్లీ వచ్చునా మళ్లీ వచ్చునా
రేగుపండ్ల కోసం ముళ్లను లెక్కచేయక
చీమచింతకాయల కోసం చివరి కొమ్మనెగబాకిన
చిన్ననాటి సబంరం మళ్లీ వచ్చునా.
ఊరిలోన మందిరములో నందిపైన కూర్చుని
అలిపిరి వచ్చిన గాని అల్లరెంతో జేసి
ఓంకార నాదధ్వని ఆలయం నిండిపోయే
నేనే ముందు నేనే ముందని శిఖరంపైకెగబాకిన
చిన్ననాటి సంబరం
మళ్లీ వచ్చునా మళ్లీ వచ్చునా
పుష్పాలను కోసిపట్టి గుడిచుట్టూ తిరుగుతూ
శివుడిమీద పూలుజల్లి గంటలేమో మ్రోగిస్తూ
అయ్యవారు ఇచ్చే ప్రసాదానికి ఆశపడి జూసే
ఆనాటి రోజులు ఆనాటి సంబరం
మళ్లీ వచ్చునా మళ్లీ వచ్చునా.



# వెలిగిపో వెలిగిపో

నాలుగు ముఖాలు లేని బ్రహ్మవై
రెండు చేతులు కలిగిన విష్ణువై
ఫాల నేత్రము లేని పరమేశ్వరుడవై
జ్ఞాన భిక్ష ప్రసాదించిన గురువువై
వాత్సల్యానికి పరమావధివై
మమకారానికి మరో రూపం నీవై
త్యాగానికి మారు పేరువు నీవై
విలు విధ్య నేర్పిన ద్రోణుడవై
గీతోపదేశం చేసిన శ్రీకృష్ణుడవై
పాశుపతాస్త్రానిచ్చిన పరమేశ్వరుడవై
గురుపీఠానికి వేదవ్యాసుడవై
ఆధ్యాత్మిక పకీరు పరమహంసవై
నా జీవన భృతికి మార్గదర్శకుడవై
అన్ని సమయాలలో ఆపద్బాంధవుడవై
ఎన్ని విధాలుగా నిన్ను పొగిడినా
కుచేలుడి అటుకులకు సమానంగ భావింపు.

# సంసారం

అదుపుమీరిన సంసారం అధోగతి పాలవును

మితిమీరిన విశ్వాసం అనర్థాలకు దారి తీయును

అనుమానమే పెనుభూతమై అశాంతినే పురిగొల్పును

క్షణకాల ఆవేశం జీవితాన్ని శాసించును

ఆలోచించిన అధికులలో ఒకరవుదురు

అందరిని ఒప్పించక ఎవరిని నొప్పించక

సంసార వలయంలో సాధ్యమా

అంచెలంచెలుగా చెంచలమైన బుద్దితో

మితిమీరిన ఆశలతో ఉన్నదానిలో తృప్తిచెందక

అవస్తలు ఎన్నో పడుతూ ఆటలాడుచున్నావా

సంసార సాగరం ఈదుచున్నావా



# తారతమ్యం

అంధకారంలో అంతా సమానం

కాంతి వెలుగుల్లో తారతమ్యం

అణిగిమణిగి ఉన్న వాడికి అంతా సమానం

ఎగిరెగిరి పడిన వారికి అంతా వ్యత్యాసం

సద్భావన కలిగి ఉన్నవాడికి అంతా సమానం

స్వార్థం ఉన్నవాడికి అంతా తారతమ్యం

అనురాగం ఉన్నవాడికి అంతా సమానం

మతానురాగాలు ఉన్నవాడికి అంతా వ్యత్యాసం

ఆలోచన పరుడికి అంతా సమానం

అనాలోచన పరుడికి అంతా వ్యత్యాసం

వివేకం ఉన్న వాడికి అంతా సమానం

అవివేకవంతుడికి అంతా వ్యత్యాసం

న్యాయాధీశులకు అంతా సమానం

న్యాయవాధులకు అంతా వ్యత్యాసం

చావు పుట్టుకలు సమానం

నడుమ జీవితమంతా తారతమ్యం

| | | |
|---|---|---|
| 79. | రైతన్న | 93 |
| 80. | తెలంగాణ | 94-95 |
| 81. | స్వర్గాలు | 96 |
| 82. | చెరువమ్మ | 97 |
| 83. | మన తెలంగాణ | 98 |
| 84. | యోగివా | 99 |
| 85. | చినుకమ్మ | 100 |
| 86. | కార్మికులు | 101 |
| 87. | తల్లిగోదావరి | 102-103 |
| 88. | భూమి | 104 |
| 89. | అమ్మని మరువకురా | 105 |
| 90. | ఫ్యాక్షనిజం | 106 |
| 91. | ఆర్యులు | 107 |
| 92. | వలస | 108 |
| 93. | ఎలా మరువను | 109 |
| 94. | వృద్ధ వయస్సు | 110 |
| 95. | భుక్తి | 111 |
| 96. | భేదాలు | 112 |
| 97. | ఆత్మ | 113 |
| 98. | కులం | 114 |
| 99. | నాలుక | 115 |
| 100. | నిజాం | 116 |
| 101. | వెలిగిపో వెలిగిపో | 117 |
| 102. | సంసారం | 118 |
| 103. | తారతమ్యం | 119 |
| 104. | చిన్ననాటి | 120 |


విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | అమ్మకడుపు చల్లన | 15 |
| 2. | అక్షరాలు | 16 |
| 3. | మన పల్లెలు | 17 |
| 4. | చదువుంటేనేమి | 18 |
| 5. | రాజనీతి | 19 |
| 6. | అణ్వస్త్రాలు | 20 |
| 7. | నల్ల బంగారం | 21 |
| 8. | పొద్దు | 22 |
| 9. | కురవక | 23 |
| 10. | కోట్లకొద్ది | 24 |
| 11. | పుడమి | 25 |
| 12. | ఊరూర చెరువు | 26 |
| 13. | పరిశ్రమలు | 27 |
| 14. | మంచి | 28 |
| 15. | ప్రపంచం | 29 |
| 16. | తల్లి తెలంగాణ | 30 |
| 17. | ఆకాశం | 31 |
| 18. | నాన్న | 32 |
| 19. | హంస | 33 |
| 20. | బాలలు | 34 |
| 21. | మహాభాగ్యం | 35 |
| 22. | శాంతి | 36 |
| 23. | ప్రాశ్చాత్య సంస్కృతి | 37 |
| 24. | చెలిమి | 38 |
| 25. | చిన్నమొక్క | 39 |
| 26. | మహిళలు | 40 |

| | | |
|---|---|---|
| **27.** | కలియుగం | **41** |
| **28.** | రాజకీయం | **42** |
| **29.** | తల్లినీకు వందనం | **43** |
| **30.** | ఎంతో విశాలమైంది | **44** |
| **31.** | మాత | **45** |
| **32.** | పుణ్యభూమి | **46** |
| **33.** | తల్లిప్రేమ | **47** |
| **34.** | శాంతి | **48** |
| **35.** | సేంద్రీయ ఎరువు | **49** |
| **36.** | ఆదిమానవుడు | **50** |
| **37.** | వీరుడు ధీరుడవై | **51** |
| **38.** | వేగుచుక్క | **52** |
| **39.** | కళాకారులు | **53** |
| **40.** | రథసారథులు | **54** |
| **41.** | ఉపాధ్యాయుడు | **55** |
| **42.** | ప్రకృతి | **56** |
| **43.** | మైకం | **57** |
| **44.** | భక్షించు | **58** |
| **45.** | గమ్యం | **59** |
| **46.** | చారిత్రక జ్ఞాపకం | **60** |
| **47.** | భగవంతుడా | **61** |
| **48.** | అనునిత్యం | **62** |
| **49.** | తనబిడ్డలు | **63** |
| **50.** | ఆనాటి ఫలాలు | **64** |
| **51.** | నీతిమాలిన | **65** |
| **52.** | సీతాకోక చిలుక | **66** |
| **53.** | వాన చినుకు | **67** |
| **54.** | కొలిమి | **68** |
| **55.** | శిల | **69** |
| **56.** | బతుకమ్మ | **70** |
| **57.** | ఆకాశవీధి | **71** |
| **58.** | తెలుగు సంపద | **72** |
| **59.** | విసురుతు | **73** |
| **60.** | మాయంకాని | **74** |
| **61.** | జన నాట్యమాడవే | **75** |
| **62.** | రాబంధులు | **76** |
| **63.** | ఆధునిక దేవాలయాలు | **77** |
| **64.** | వందేమాతరం | **78** |
| **65.** | నీతి పలుకులు | **79** |
| **66.** | బట్టచాటున | **80** |
| **67.** | చిన్న జీవులు | **81** |
| **68.** | అద్దం | **82** |
| **69.** | త్యాగశీలులారా | **83** |
| **70.** | గుండె తరుక్కుపోతుంది | **84** |
| **71.** | కోయిల | **85** |
| **72.** | కాకతీయ | **86** |
| **73.** | హేళన | **87** |
| **74.** | భగవంతుడి సేవలో | **88** |
| **75.** | సర్కారు ఉద్యోగుల్లారా | **89** |
| **76.** | సూర్యుడు | **90** |
| **77.** | నల్లగొండ | **91** |
| **78.** | కలం | **92** |